విలేకరులు కావలెను

సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.

96667 32777

ప్రభాత సూర్య
www.suryaa.news

ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news

హైదరాబాద్
21-12-2025
వెల: రూ.5/-
పేజీలు: 8
సంపుటి: 01
సంచిక: 109

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



# అందరికీ మత స్వేచ్ఛ

- విద్వేషపూరిత ప్రసంగాలపై త్వరలో అసెంబ్లీలో చట్టం
- క్రిస్మస్ విందు కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- అన్ని మతాలకు సమానమైన హక్కు, అధికారం, స్వేచ్ఛ
- రాష్ట్రంలో ఇప్పటికే ఎవరి మతాన్ని వాళ్లు ఆచరించుకునే వాతావరణం
- మత ప్రాతిపదికన దాడులపై ఉక్కుపాదం
- మైనారిటీలకు అందించే సంక్షేమం దయ కాదు.. అది వారి హక్కు అని స్పష్టి కరణ

మతాలను కించపరిచే విధంగా ఎవరైనా మాట్లాడితే కఠిన చర్యలు తీసుకుని శిక్షించడానికి వీలుగా త్వరలోనే శాసనసభలో విద్వేషపూరిత ప్రసంగాలకు సంబంధించిన చట్టాన్ని తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇటీవల కర్ణాటక అసెంబ్లీలో ఇతర మతాలను తక్కువ చేసే విధంగా మాట్లాడితే శిక్షించే విధంగా చట్టాన్ని సవరించారని, తెలంగాణ రాష్ట్రంలో కూడా బడ్జెట్ సమావేశాల్లో అలాంటి చట్టాన్ని తీసుకొస్తామని తెలిపారు.

# నేనైతే రేవంత్‌తో ఫుట్‌బాల్ ఆడుకుంటా



- రేవంత్ ఎవరితో ఫుట్‌బాల్ ఆడినా అక్కర్లేదు
- రేవంత్ లాగా చిల్లర రాజకీయాలు చేయను
- కాంగ్రెస్‌లో ఓ కాలు..బిజెపిలో ఓ కాలు పెట్టింది రేవంతే
- మీడియా చిట్‌చాట్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## ఉద్యోగ నియామకాల్లో జాప్యం తగదు

- జాబ్ క్యాలెండర్ ఉండాల్సిందే
- లేకుంటే యువత భవిష్యత్ దెబ్బతింటుంది
- తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్: పబ్లిక్ సర్వీస్ కమిషన్లు దేశ పరిపాలనా వ్యవస్థకు వెన్నెముకలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. న్యాయమైన, పారదర్శక నియామకాల ద్వారానే




## ప్రభుత్వ ఉద్యోగాల్లో నైతికతకూ చోటివ్వాలి

- నేటి పాలనకు చదువుల ప్రతిభ ఒక్కటే చాలదు
- నైతిక నిర్ణయ శక్తి, భావోద్వేగ మేధస్సు, నాయకత్వం, టీమ్‌వర్క్ ఉండాలి
- అలాంటి వారే దేశ సేవలో ముందు వరుసలో నిలబడతారు
- పీఎస్సీల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

2లో

# పార్లమెంట్ ముట్టడికి యత్నం

- బంగ్లాదేశ్‌లో తీవ్ర ఉద్రిక్తత
- హదీ అంత్యక్రియల తర్వాత పార్లమెంట్‌వైపు దూసుకొచ్చిన జనం
- లాఠీచార్జి చేసి చెదరగొట్టిన పోలీసులు
- హదీ జ్ఞాపకాలు సజీవం అంటూ నివాళులర్పించిన మహ్మద్ యూనస్



ఢాకా: 'ఇంక్విలాబ్ మంచ్'నాయకుడు షరీఫ్ ఉస్మాన్ హదీ అంత్యక్రియలు పూర్తయిన తర్వాత వేలాది మంది జనం బంగ్లాదేశ్ పార్లమెంట్‌ను ముట్టడించేందుకు ప్రయత్నించడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. శనివారం పార్లమెంట్ వైపు ర్యాలీగా దూసుకొస్తున్న ప్రజలను పోలీసులు అడ్డుకున్నారు. లాఠీచార్జి చేసి వారిని చెదరగొట్టారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. అతికష్టంమీద పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అంతకుముందు పార్లమెంట్ ప్రాంగణంలో హదీ మృతదేహం వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తాత్కాలిక ప్రభుత్వాధినేత మహ్మద్ యూనస్,



## బిఆర్ఎస్‌తో కాంగ్రెస్ కుమ్మక్కు

- అందుకే అవినీతి కేసుల్లో విచారణలు పక్కదారి
- మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్

హైదరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌లపై కేంద్ర హోం శాఖ సహాయక మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పాలన..



## ఆఫర్ల పేరుతో సైబర్ నేరాలు

- అప్రమత్తంగా ఉండాల్సిందే
- ప్రజలను హెచ్చరించిన సిపి సజ్జనార్

హైదరాబాద్: ఏపీకే ఫైల్స్, ఓటీపీ, బ్యాంక్ ట్రాన్సిషన్ పై అప్రమత్తంగా

2లో



2లో

# మహా జంగిల్‌రాజ్‌ను అంతం చేస్తాం

- పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బీజేపీదే విజయం
- బిహార్ ఫలితాలు బెంగాల్‌లోనూ పునరావృతం
- 'పరివర్తన్ సంకల్ప సభ'లో తేల్చిచెప్పిన ప్రధాని నరేంద్ర మోదీ
- డబుల్ ఇంజిన్ ప్రభుత్వానికి పట్టం కట్టాలని ప్రజలకు పిలుపు

## ఉద్యోగ నియామకాల్లో జాప్యం తగదు

ప్రజాసేవలో ప్రతిభకు స్థానం ఉంటుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. రామోజీ ఫిల్మ్ సిటీలో ఏర్పాటు చేసిన 26వ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పరీక్షలకు వార్షిక జాబ్ క్యాలెండర్ తప్పనిసరని అన్నారు. ఉద్యోగ నియామకాల జాప్యం యువత భవిష్యత్తును దెబ్బతీస్తాయని.. ముందస్తు ప్రణాళికతోనే వారిలో విశ్వాసం పెరుగుతుందని చెప్పుకొచ్చారు. తెలంగాణ పీఎస్సీ విజయవంతంగా జాబ్ క్యాలెండర్ అమలు చేస్తోందని చెప్తూ కమిషన్ ఛైర్మన్, సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం తరఫున అభినందించారు. పారదర్శకతే పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ప్రాణమని.. ప్రశ్నాపత్రాల తయారీ నుంచి తుది ఎంపిక వరకూ ప్రతి దశ స్పష్టంగా ఉండాలన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజ్‌లు ప్రజాసేవ విలువలకు విరుద్ధమని.. వాటిని కట్టడి చేసేందుకు ఆధునిక భద్రతా వ్యవస్థలు, నైతిక శిక్షణ అవసరమని సూచించారు. రిజర్వేషన్లు సంఖ్యలకే కాదని, వాస్తవిక ఫలితాలు ఇవ్వాలంటూ డిప్యూటీ సీఎం భట్టి చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ బుర్రా వెంకటేశం హాజరయ్యారు.

## ఒక గొప్ప నాయకుడిని ఒక కులానికి పరిమితం చేస్తారా?: పవన్ కల్యాణ్

మహనీయులకు, గొప్ప నాయకులకు కులాలను అంటగడితే మనం ఎప్పటికీ భారతీయులుగా ఎదగలేమని, కేవలం కులాల సమూహంగానే మిగిలిపోతామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఉభయ గోదావరి జిల్లాల ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు రూ.3,050 కోట్ల వ్యయంతో చేపడుతున్న 'అమరజీవి జలధార' ప్రాజెక్టు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. అంబేద్కర్, గాంధీ, పొట్టి శ్రీరాములు వంటి వారు అందరి కోసం ఆలోచించిన గొప్పవారని, వారిని కులాలకు అతీతంగా చూడాలని సూచించారు. గతంలో తాను పొట్టి శ్రీరాములు జయంతి నాడు నివాళులు అర్పించేందుకు వెళ్తే, ఆయన విగ్రహం ఒక ఆర్యవైశ్య సత్రం వద్ద ఉందని చెప్పారని, ఆ రోజు తాను ఎంతో ఆవేదనకు గురయ్యానని గుర్తుచేసుకున్నారు. తెలుగు ప్రజలందరి కోసం ప్రాణత్యాగం చేసిన వ్యక్తిని ఒక కులానికి, నెల్లూరు జిల్లాకు పరిమితం చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా 5 జిల్లాల్లో 'అమరజీవి జలధార' వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం రూ.7,910 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు 'అమరజీవి' అని పేరు పెట్టడానికి బలమైన కారణం ఉందని వివరించారు. తెలుగువారంతా ఏకం కావాలని ముఖ్యమంత్రి పదవిని త్యాగం చేసిన బూర్గుల రామకృష్ణారావు, తెలుగువారి ఆత్మగౌరవం కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు తనకు ఎంతో ఇష్టమైన నాయకులని, వారి త్యాగాలను స్మరించుకుంటూనే ఈ పథకానికి ఆ పేరు పెట్టినట్లు స్పష్టం చేశారు.

## ప్రభుత్వ ఉద్యోగాల్లో నైతికతకూ చోటివ్వాలి

హైదరాబాద్: ప్రభుత్వ పాలనను ముందుకు నడిపే అధికారులు, ఉద్యోగుల ఎంపిక ప్రక్రియలో నైతికతకూ ప్రాధాన్యం ఇవ్వాలని.. ఈ దిశగా పబ్లిక్ సర్వీస్ కమిషన్లు కృషి చేయాలని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ సూచించారు. నేటి పాలనకు కేవలం చదువుల ప్రతిభ ఒక్కటే చాలదన్నారు. నైతికంగా నిర్ణయం తీసుకునే శక్తి, భావోద్వేగ మేధస్సు, నాయకత్వ లక్షణాలు, టీమ్‌వర్క్ చేయించే సత్తా తప్పనిసరి అన్నారు. అలాంటి వారే దేశ సేవలో ముందు వరుసలోకి వస్తారని చెప్పారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ (పీఎస్సీ)ల రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ శనివారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. వికసిత్ భారత్%–%2047 లక్ష్యాలను సాధించాలంటే పరిపాలన నాణ్యతతోపాటు పాలనను నడిపించే వ్యక్తుల నాణ్యత కూడా కీలకమన్నారు. దేశ పాలనా వ్యవస్థల నాణ్యత, సమగ్రత, సమర్థతను తీర్చిదిద్దడంలో పీఎస్సీల పాత్ర కీలకమని చెప్పారు. అర్హత, నిష్పక్షపాత ధోరణి, నైతికత కలిగిన అధికారులను ఎంపిక చేయాల్సిన బాధ్యత పీఎస్సీలపై ఉందన్నారు. రాజ్యాంగం కల్పించిన స్వతంత్రత వల్లే పీఎస్సీలు ప్రతిభ, న్యాయం, పారదర్శకతలను కాపాడగలుగుతున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో పీఎస్సీలు నిష్పక్షపాత నియామకాల ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయని.. పరిపాలనా స్థిరత్వాన్ని నిలబెట్టాయని ప్రశంసించారు. డిజిటల్ గవర్నెన్స్, మౌలికవసతుల అభివృద్ధి వంటి జాతీయ ప్రాధాన్యాల అమలు అధికారుల నాణ్యతపైనే ఆధారపడి ఉంటుందన్నారు. చిన్నపాటి అవకతవకలు కూడా సంస్థల విశ్వసనీయతను దెబ్బతీస్తాయని, పరీక్షల్లో అక్రమాలను ఉపేక్షించొద్దని ఉపరాష్ట్రపతి స్పష్టం చేశారు. ఉన్నత ఉద్యోగాలకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో జ్ఞానాధారిత పరీక్షలతోపాటు ప్రవర్తన, నైతిక నైపుణ్యాల్ని అంచనా వేసే విధానాలను కూడా పీఎస్సీలు పరిశీలించాలని సూచించారు. వ్యక్తిత్వం, నైతిక ప్రవర్తనే దేశ నిర్మాణానికి, ప్రజా విశ్వాసానికి పునాది అని ఉపరాష్ట్రపతి స్పష్టం చేశారు.

## బిఆర్ఎస్‌తో కాంగ్రెస్ కుమ్మక్కు

అవినీతి మయంగా, దరిద్రంగా ఉందని ఆయన ధ్వజమెత్తారు. తల నరికినా.. పైసా లేదని సీఎం రేవంత్ అంటున్నారని.. అందువల్లే ఇక్కడి ప్రజలు ఆంధ్రప్రదేశ్‌లాగే డబుల్ ఇంజిన్ సర్కారును కోరుకుంటున్నారని విమర్శించారు. ఈసారి ఎన్నికలు ఎప్పుడొచ్చినా అధికారం తమదేనని ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఈసారి ఎప్పుడు ఎన్నికలు వచ్చినా.. తెలంగాణలో సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని పదేళ్ల నుంచి అంటున్నారు. ఈ రెండు పార్టీలు ఎప్పుడూ కలిసి పోటీ చేయలేదు. కానీ, కాంగ్రెస్ పార్టీతో కలిసి బీఆర్ఎస్ బరిలో దిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే.. అవినీతికి పాల్పడిన కేసీఆర్‌ను జైలుకు పంపుతానన్న రేవంత్ రెడ్డి మాటలు ఏమైయ్యానని నిలదీసారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌ను జైలుకు పంపారా? కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిలో జైలుకు పంపారా? డ్రగ్స్ కేసులో జైలుకు పంపారా? ఫాం హౌస్ కేసులో జైలుకు పంపారా? కాంగ్రెస్, బీఆర్ఎస్ దోస్తులు కాబట్టే కేసీఆర్ ఫ్యామిలిలో ఎవరినీ జైలుకు పంపలేదని ఇరు పార్టీలపై బండి సంజయ్ ధ్వజమెత్తారు .కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. ఎన్నికలలో ఓడిన తర్వాత కేసీఆర్ ఎక్కడా కనబడలేదని.. అయితే ఫామ్ హౌజ్ లేదా యశోదా ఆసుపత్రిలో మాత్రమే కనిపిస్తున్నారని చెప్పుకొచ్చారు. ఫామ్ హౌజ్ పాలను తెలంగాణ ప్రజలు కోరుకోవడం లేదన్న ఆయన.. పంచాయితీ ఎన్నికల్లో తమ పార్టీకి గతంలో 100 సీట్లు వస్తే.. ఇప్పుడు 600కు పైగా స్థానాలొచ్చాయన్నారు. లీకు వీరులు అన్ని పార్టీలోనూ ఉన్నారని ఈ సందర్భంగా కౌంటర్ వేశారు. ఆంధ్రప్రదేశ్(ఒనిటరసజీ ఖసజీటుబర)లో కూటమి పాలన అద్భుతంగా సాగుతోందని బండి సంజయ్ కొనియాడారు. 'ఏపిలో కూటమి పాలనకు వందకు వంద మార్కులు పడతాయి.

# నేనైతే రేవంత్‌తో ఫుట్‌బాల్ ఆడుకుంటా

హైదరాబాద్: రేవంత్.. ఎవరితో ఫుట్‌బాల్ ఆడుకుంటాడో నాకు తెలియదు... నేను మాత్రం రేవంత్ రెడ్డిని ఫుట్‌బాల్ ఆడుకుంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. రేవంత్ ఇంట్లోని మహిళలను, పిల్లలను, మనవడి గురించి నేను మాట్లాడను. రేవంత్ రెడ్డి మాదిరి కుటుంబ సభ్యుల విషయంలో నేను చిల్లర రాజకీయాలు చేయనన్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ కు హనీమూన్ ముగిసింది. ఇక కేసీఆర్ ప్రజల్లోకి వస్తారు .కేసీఆర్ ఆదివారంఅన్ని విషయాలపై దిశానిర్దేశం చేస్తారని అన్నారు. ఈ మేరకు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కేటీఆర్ మరోసారి ౹ ÷ర్ అయ్యారు. రేవంత్ రెడ్డి సర్కార్‌కి హనీమూన్ ముగిసిందంటూ ఆయన ఎద్దేవా చేశారు. శనివార తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సంద్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. లోకల్ బాడీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ మెంబర్ షిప్ కార్యక్రమం ఉంటుంది. కేసీఆర్ బహిరంగ సభలపై రేపటి సమావేశంలో నిర్ణయం ఉంటుంది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు...కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ లో ప్రెస్ మీట్ పెట్టి.. బీఆర్ఎస్ లోనే ఉన్నామనటం పెద్ద కామెడీగా ఉంది. పంచాయతీ ఎన్నికల విషయంలో రేవంత్ చెప్తోన్న 66శాతం నిజమైతే.. పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి బైపోల్స్ కు రావాలి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెండ్ గా నేను ఫెయిల్ కాదు. నేను వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యాక32జిల్లా పరిషత్, 136మున్సిపాలిటీలు గెలిచాము. రేవంత్ సీఎం అయ్యాక.. సొంత పార్లమెంట్ స్థానాన్ని కూడా గెలిపించలేదు. నేను ఐరన్ లెగ్ కాదు.. రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీలే ఐరన్ లెగ్‌లు. పంచాయతీ ఎన్నికల దెబ్బకు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ఇప్పట్లో నిర్వహించరు. మొదట మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తారు. అలానే గ్రేటర్‌లో మున్సిపాలిటీల విలీనం సక్రమంగా జరగలేదు. జీహెచ్ఎంసీని మూడు కార్పోరేషన్లు చేయాలనేది రేవంత్ రెడ్డి ఆలోచనగా ఉంది. అయితే గ్రేటర్ ఎన్నికలు ఎప్పుడు పెట్టాలనే దానిపై కూడా సీఎంకు స్పష్టత లేదు. 2028లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది.ఫార్ములా ఈ రేస్, కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో ఏమీ లేదని రేవంత్ కు అర్థమైంది. రేవంత్ పాలనకు పంచాయతీ ఎన్నికల ఫలితాలే నిదర్శనం. కాంగ్రెస్ పాలన దెబ్బకు పరిశ్రమలు ఆంధ్రకు వెళ్ళిపోతున్నాయి. విరూపాక్ష అనే కంపెనీ కర్నూలుకు వెళ్లింది. కాంగ్రెస్ పాలనపై ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. టైమ్ కోసం ఎదురు చూస్తున్నారు. సరైన సమయంలో కాంగ్రెస్ కు, రేవంత్ రెడ్డికి ప్రజలు సరైన తీర్పు ఇస్తారు. ఇక 42శాతం రిజర్వేషన్లు పార్టీ పరంగా ఇవ్వమని చెప్పటానికి రేవంత్ ఎవరు?. మేము పార్లమెంట్ ఎన్నికల్లో 50శాతం, అసెంబ్లీ ఎన్నికల్లో 30శాతం సీట్లు బీసీలకు ఇచ్చాము. ఆయన నుంచి నేర్చుకోవాల్సిన అవసరం మాకు లేదు. మార్కెట్ యార్డ్ లు బీసీలకు ఇచ్చాము. అలానే విద్యా, ఉపాధిలో బీసీలకు రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వరని అన్నారు. అఖిలేష్ యాదవ్ తో ఫ్రెండ్లీగా ఉంటే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు బాధ ఎందుకన్నారు.. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీకి మాత్రమే లోపాయికారి ఒప్పందం ఉంది. తెలంగాణ కాంగ్రెస్ కు ఏటీంగా మారిందని ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా స్వయంగా అన్నారు. ఢిల్లీలో బీజేపీ ఎంపీ దుబే గృహప్రవేశానికి తెలంగాణ సీఎం ఎందుకు వెళ్లారో రామచంద్రరావు చెప్పాలి. ఢిల్లీలో రేవంత్ రెడ్డి విందులు, వినోదాలు ఎవరి ఇళ్ళల్లో జరుగుతున్నాయో మాకు తెలుసు. దేశ రాజధాని ఢిల్లీలోని తుగ్లక్ రోడ్ లో రేవంత్ రెడ్డి ఇల్లు రీమోడల్ చేయించిందే బీజేపీ ఎంపీనే. తెలంగాణ సీఎం రేవంత్ .. ఒక కాలు కాంగ్రెస్ లో.. మరొక కాలు బీజేపీలో ఉంచారు. కిషన్ రెడ్డితో మాకు అండర్ స్టాండింగ్ ఉందని అంటున్నారు. కిషన్ రెడ్డి మాకు చేసింది ఏంటో చెప్పాలి' అంటూ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు.



## ఈ వయసులోనే జీవితానికి బాట

తాళ్లపాలెంలోని సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 'ముస్తాబు కార్నర్'ను సీఎం పరిశీలించి, విద్యార్థినులతో ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమం నేటి నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో అమలు కానుందని చంద్రబాబు ప్రకటించారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఆలోచనతో రూపుదిద్దుకున్న ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఒక అధికారి చొరవతో మొదలైన మంచి పనిని రాష్ట్రమంతటా అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "విద్యార్థుల్లో వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం పెంచడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. పాఠశాలకు చక్కటి యూనిఫాంతో, పరిశుభ్రంగా రావాలి. చక్కగా తల దువ్వుకోవడం, భోజనానికి ముందు శుభ్రంగా చేతులు కడుక్కోవడం వంటి మంచి అలవాట్ల వల్ల ఆరోగ్యంగా ఉంటారు. ఈ ముస్తాబు కార్యక్రమానికి అదనంగా డబ్బులు ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. దీనివల్ల విద్యార్థుల్లో చదువుపై శ్రద్ధ పెరగడమే కాకుండా, నాయకత్వ లక్షణాలు కూడా అలవడతాయి" అని వివరించారు. రాష్ట్రంలోని 75 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రభుత్వ బాధ్యత అని చంద్రబాబు స్పష్టం చేశారు. "మీరంతా రాష్ట్రానికి గొప్ప ఆస్తి. అందుకే అమ్మకు వందనం ద్వారా ఆర్థిక సాయం, నాణ్యమైన పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, పౌష్టికాహారంతో కూడిన భోజనం అందిస్తున్నాం.

## పార్లమెంట్ ముట్టడికి యత్నం

(మొదటి పేజీ తరువాయి):

ఆర్మీ చీఫ్ జనరల్ వకార్ ఉజ్ జమాన్ తదితర ప్రముఖులు హాజరయ్యారు. బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ, జమాత్ –ఇ–ఇస్లామీ, నేషనల్ సిటిజెన్ పార్టీ నేతలు, కార్యకర్తలు సహా వేలాది మంది జనం తరలివచ్చారు. 'ఢిల్లీ లేదా ఢాకా.. ఢాకా, ఢాకా', 'హదీ రక్తం వృథా కావడానికి వీల్లేదు'అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బంగ్లాదేశ్ ఉనికి ఉన్నంతవరకూ హదీ జ్ఞాపకాలు ప్రజల హృదయాల్లో ఉంటాయని మహ్మద్ యూ నస్ నివాళులర్పించారు. హదీ అంత్యక్రియల సందర్భంగా ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. హదీ మృతదేహాన్ని చూడడానికి సామాన్య ప్రజలకు అనుమతి ఇవ్వలేదు. దేశవ్యాప్తంగా శనివారం సంతాప దినంగా పాటించారు. ఈ నెల 12వ తేదీన ఎన్నికల ప్రచారం కోసం వెళ్తున్న హదీపై దుండగులు కాల్పులు జరిపారు. పరిస్థితి విషమించడంతో సింగపూర్ కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈ వార్త తెలిసిన వెంటనే బంగ్లాదేశ్‌లో జనం ఆందోళనకు దిగారు. గురువా రం రాత్రి పెద్ద ఎత్తున హింసాకాండ చోటుచేసుకుంది. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులపై, పత్రికా కార్యాలయాలపై దాడులు జరిగాయి. అల్లరిమూక దాడిలో హిందూ కార్మికుడు దీపూచంద్ర దాస్ మృతిచెందాడు. శుక్రవారం కల్లా పరిస్థితి అదుపులోకి వచ్చింది. శనివారం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని అధికారులు వెల్లడించారు. షరీఫ్ ఉస్మాన్ హదీ మృతదేహాన్ని పార్ల మెంట్ నుంచి ఢాకా యూనివర్సిటీ క్యాంపస్‌కు తరలించారు. క్యాంపస్ మసీదు సమీపంలో బంగ్లాదేశ్ జాతీయ కవి కాజీ నజ్రుల్ ఇస్లామ్ సమాధి పక్కనే ఖననం చేశారు. 1976లో నజ్రుల్ ఇస్లామ్‌ను ఇక్కడ సమాధి చేశారు. ఆయన తిరుగుబాటు కవిగానూ పేరుగాంచారు. హింస, విద్వేషాలకు వ్యతిరేకంగా ఉద్యమించారు. తన కవితలతో ప్రజలను చైతన్యవంతులను చేశారు. నజ్రుల్ ఇస్లామ్ కవితలను హదీ తన ప్రసంగాల్లో తరచుగా ప్రస్తావిస్తూ ఉండేవారు. దదీపూచంద్ర హత్య కేసులో పది మంది అరెస్టు బంగ్లాదేశ్‌లో హదీ హత్య నేపథ్యంలో హిందూ కార్మికుడు దీపూచంద్ర దాస్(25)ను కొట్టి చంపిన కేసులో పది మంది నిందితులను పోలీసులు అరెస్టుచేశారు. గురువారం అల్లరి మూక దీపూచంద్రను దారుణంగా కొట్టి చంపి, దహనం చేసిన సంగతి తెలిసిందే.

## ఆఫర్ల పేరుతో సైబర్ నేరాలు

ఉండాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'బయట రాష్ట్రాల్లో ఉండి నిందితులు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. వేరొక స్టేట్స్ లో ఉన్న నిందితుల్ని గుర్తించడం, డబ్బును రికవరీ చేయడం కష్టంగా మారింది. ఈ సైబర్ మోసాల కారణంగా హైదరాబాద్ ప్రజలు రోజుకు కోటి రూపాయలు నష్టపోతున్నారు. అలానే సైబర్ నేరగాళ్లు రెండు విధాలుగా నేరాలకు పాల్పడుతున్నారు. ఒకటి పెట్టుబడి పేరుతో మోసం చేస్తున్నారు.... రెండోవది డిజిటల్ అరెస్ట్ తో మోసం చేస్తున్నారని హెచ్చరించారు. డిజిటల్ అరెస్ట్ తో ఎక్కువగా వృద్ధులు, రిటైర్డ్ ఉద్యోగులు మోసపోతున్నారు. ప్రజలు సైబర్ కేటుగాళ్లు, వాళ్ల మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఏమైనా అనుమానాస్పద కాల్స్ వస్తే 1930 కి లేదా 100 కి కాల్ చేయాలన్నారు. రాబోయే పండుగలు సంక్రాంతి, క్రిస్మస్ సందర్భంగా సైబర్ నేరగాళ్లు ఆఫర్ల పేరుతో మోసాలకు పాల్పడే అవకాశం ఉంది. ఇక మధుర నగర్‌లో ట్రాఫిక్ సమస్యల నివారణకు త్వరలో చర్యలు కూడా తీసుకుంటాం.

# మహా జంగిల్‌రాజ్‌ను అంతం చేస్తాం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్‌పై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మమతా బెనర్జీ పార్టీ అవినీతి, బంధుప్రీతి కారణంగా రాష్ట్రం అధోగతి పాలైందని మండిపడ్డారు. ఇక్కడ మహా జంగిల్‌రాజ్ ప్రభుత్వం రాజ్యమేలుతోందని, అరాచక పాలన సాగుతోందని ధ్వజమెత్తారు. గతంలో బిహార్‌లో ఆటవిక రాజ్యం ఉండేదని, సరిగ్గా అలాంటి పరిస్థితులే ఇప్పుడు బెంగాల్‌లో కనిపిస్తున్నాయని ఆరోపించారు. ఇటీవల బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించామని, అదే ఫలితం బెంగాల్‌లోనూ పునరావృతం కాబోతోందని తేల్చిచెప్పారు. బెంగాల్ రాష్ట్రం నాడియా జిల్లాలోని తాహెర్‌పూర్‌లో శనివారం నిర్వహించిన 'పరివర్తన్ సంకల్ప సభ'లో ప్రధాని మోదీ కోల్‌కతా నుంచి వర్చువల్‌గా ప్రసంగించారు. బెంగాల్ కోటపై జెండా ఎగురవేయబోతున్నామని స్పష్టంచేశారు. మహా జంగిల్‌రాజ్‌ను కచ్చితంగా అంతం చేస్తామని తేల్చిచెప్పారు. బిహార్ ఎన్నికల ఫలితాలతో బెంగాల్‌లో బీజేపీ విజయానికి ద్వారాలు తెరుచుకున్నాయని పేర్కొన్నారు. గంగా నది బిహార్ నుంచి బెంగాల్‌లోకి ప్రవహిస్తోందని వ్యాఖ్యానించారు. వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఒక అవకాశం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని తీసుకురావాలన్నారు. "తృణమూల్ కాంగ్రెస్ పార్టీ పెద్దలు నన్ను, బీజేపీని ఎంతగా వ్యతిరేకించినా మాకు అభ్యంతరం లేదు. కానీ, ప్రజలను ఎందుకు వేధిస్తున్నారో, రాష్ట్ర అభివృద్ధిని ఎందుకు అడ్డుకుంటున్నారో సమాధానం చెప్పాలి. అవినీతి, బంధుపీత్రి, బుజ్జగింపు రాజకీయాల వల్ల ఇక్కడ ప్రగతి ఆగిపోయింది. ప్రజలు కష్టాలు పడుతున్నారు. కట్ మనీ, కమీషన్ల సంస్కృతికి చరమగీతం పాడాల్సిన సమయం వచ్చింది. బెంగాల్ నిజంగా అభివృద్ధి చెందాలని కోరుకుంటే బీజేపీని గెలిపించాలి. మాకు ఒక్క అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తాం. తృణమూల్ కాంగ్రెస్ అకృత్యాల నుంచి బెంగాల్‌కు విముక్తి కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. 'బతికి ఉండాలంటే బీజేపీ రావాలి' అనే నినాదం రాష్ట్రంలో మార్మోగిపోతోంది. చొరబాటుదారులకు తృణమూల్ కాంగ్రెస్ అండగా నిలుస్తుండడం సిగ్గుచేటు. వారిని కాపాడేందుకే ఓటర్ల జాబితా సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)ను ఆ పార్టీ వ్యతిరేకిస్తోంది. మనదేశంలోకి అక్రమంగా ప్రవేశించినవారిని గుర్తిస్తే వచ్చే నష్టమేంటో చెప్పాలి. బంగ్లాదేశ్‌లో మతపరంగా వేధింపులకు గురై మన దేశంలోకి వచ్చినవారికి సీఏఏ ద్వారా పౌరసత్వం ఇవ్వాలని సంకల్పించాం. దానిపై తృణమూల్ కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోంది. బాధితులను బెదిరించాలని చూస్తోంది" అని మోదీ విమర్శించారు. తాహెర్‌పూర్‌లో ప్రధాని మోదీకి బదులుగా బెంగాల్ గవర్నర్ సి.వి.ఆనంద బోసు రూ.3,200 కోట్ల విలువైన రహదారుల ప్రాజెక్టులను ప్రారంభించారు. భారీ పొగమంచు కారణంగా ప్రధాని మోదీ హెలికాప్టర్ వెనక్కి వెళ్లాల్సి వచ్చింది. మోదీ హెలికాప్టర్‌లో కోల్‌కతా నుంచి తాహెర్‌పూర్ చేరుకున్నారు. తాత్కాలికంగా ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌పై దిగాల్సి ఉండగా, పొగమంచు వల్ల అది సాధ్యం కాలేదు. దాంతో చేసేది లేక హెలికాప్టర్‌ను మళ్లీ కోల్‌కతా ఎయిర్‌పోర్టుకు మళ్లించారు. మోదీ కోల్‌కతా నుంచే వర్చువల్‌గా ప్రసంగించారు. మోదీ సభకు వెళ్తుండగా ప్రమాదం.. ముగ్గురి మృతి తాహెర్‌పూర్‌లో సభ సందర్భంగా విషాదం చోటుచేసుకుంది. మోదీ ప్రసంగించే సభకు వెళ్తుండగా రైలు ఢీకొట్టడంతో ముగ్గురు బీజేపీ కార్యకర్తలు మృతిచెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. సీల్దా%–%కృష్ణానగర్ సెక్షన్‌లోని తాహెర్‌పూర్, బడ్కుల్లా రైల్వేస్టేషన్ల మధ్య పొగమంచు వల్ల ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపా రు.

# సంత్ గాడ్గే బాబాకు నివాళులర్పించిన
# ప్రజాసంఘాల నాయకులు

### పార్లమెంటుకు సంత్ గాడ్గేబాబా పేరు పెట్టాలి -ముత్యాల నర్సింగరావు

### భారత రత్న ప్రకటించాలి - డాక్టర్ రాజా సర్

### సంత్ గాడ్గేబాబా జయంతిని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా చేయాలి - రాజ్ కుమారి అల్వాల్

నల్లకుంట,డిసెంబర్ 20(ప్రభాత సూర్య): సంత్ గాడ్గే బాబా 69వ వర్ధంతి వేడుకలను హైదరాబాద్ నల్లకుంట శతాబ్ది భవనంలో శనివారం గాడ్గే బాబా దళిత్ సేవా సంఘం అధ్యక్షులు డాక్టర్ స్వామి అల్వాల్ అపరజిత్ కూతురు రాజ్ కమారి అల్లుడు సెబాస్టియన్ అధ్వర్యంలో డాక్టర్ రాజా సర్ ముఖ్యఅతిథిగా హాజరై సంత్ గాడ్గే బాబా విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్యాల నర్సింగరావు మాట్లాడుతూ గాడ్గే బాబా సాధువు, సంఘ సంస్కర్త, గ్రామాల్లో శుభ్రత, తోటి వారికి సాయపడే లక్షణం, కుల నిర్మూలన,అంటరానితనం నిర్మూలన,ఆధ్యాత్మిక చైతన్యం, సేవా వంటి వాటిని ప్రచారం చేస్తూ 143 పాఠశాలలు, మహారాష్ట్ర యూనివర్సిటీ కూడా స్థాపించడం జరిగింది.గాంధీజీ కంటే 15 సంవత్సరాల ముందే "స్వచ్ఛభారత్"ను కనిపెట్టి ఆచరించిన మహనీయుడు. డాక్టర్ రాజా సర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తన "గురువు"గా బాబా ని ప్రకటించుకోవడం జరిగింది. అలాంటి గొప్ప వ్యక్తిత్వం కలిగిన సంత్ గాడ్గే బాబా సేవలను ప్రభుత్వం గుర్తించి జయంతిని అధికారికంగా నిర్వహించాలని వారన్నారు . రాజ్ కుమారి అల్వాల్ మాట్లాడుతూ సంత్ గాడ్గేబాబాకు




భారత రత్న ఇవ్వాలి , పార్లమెంటుకు ఆయన పేరు పెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. నేటి తరానికి వారెంతో ఆదర్శమూర్తి అని కొనియాడారు. వారు చేసిన సేవలను ముందు తరాలకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో శివసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంద్రపు సుదర్శన్,ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బర్లపాటి జయరాం, తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక, రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి బేగంపేట నర్సిములు యం,నర్సింగ్ రావు ,ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బడుగుల బాలకృష్ణ, సీనియర్ నాయకులు రంగుల వేణు, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పొలాస సాయి కుమార్,జిల్లా నాయకులు కొత్ర సంపత్, రఘు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు

### కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన ఆకుల ఇంద్రసేనారెడ్డి

**చౌటుప్పల్. డిసెంబర్ 20. ప్రభాత సూర్య :** చౌటుప్పల్ మండలం మసీదు గూడెం గ్రామానికి చెందిన పలువురు బి.ఆర్. ఎస్ కార్యకర్తలు భారీగా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు.చౌటుప్పల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ దేవేందర్ లు వారికి శనివారం లక్కారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ... మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నాయకత్వంలో మునుగోడు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలమైన శక్తిగా మారిందని, మునుగోడు నియోజకవర్గం లో అత్యధిక సర్పంచ్ స్థానాలు గేలుసుకోవడం జరిగిందని అన్నారు. విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ లకు, వార్డు మెంబర్లకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.త్వరలో రాజగోపాల్ రెడ్డి మంత్రి కాబోతున్నారని నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో బక్క లింగస్వామి, బక్క రమేష్, బక్క మహేష్, భక్త శ్రీనివాస్, బక్క మహేష్, బక్క ధనుంజయ, బక్క నవీన్, బక్క దాసు, రాచపాక బుచ్చయ్య, జిల్లెల ప్రశాంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో మసీదు గూడెం సర్పంచ్ మర్రి వంశీధర్ రెడ్డి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాటేపల్లి నవీన్,మాజీ మున్సిపల్ లో ఫ్లోర్ లీడర్ కొయ్యడ సైదులు గౌడ్,మాజీ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొగుదాల రమేష్ గౌడ్, మసీదు గూడెం ఎన్నికల ఇంచార్జ్ కంచరకుంట్ల రాంరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, సాయి ,గణేష్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శిల్పారామం లో ప్రారంభమైన అల్ ఇండియా క్రాఫ్ట్స్ మేళ....



**మాదాపూర్ ప్రభాత సూర్య :** శిల్పారామం మాదాపూర్ లో శనివారం నుండి అల్ ఇండియా క్రాఫ్ట్స్ మేళ ప్రారంభమయింది. డెవలప్మెంట్ కమీషనర్ హ్యాండ్లూమ్స్, మినిస్ట్రీ అఫ్ టెక్స్టైల్స్, గవర్నమెంట్ అఫ్ ఇండియా, నేషనల్ జ్యూట్ బోర్డు మరియు శిల్పారామం సంయుక్త నిర్వహణ లో అంతర్జాతీయ హస్తకళా ఉత్సవం నిర్వహిస్తున్నారు. భారత దేశం లోని వివిధ రాష్ట్రాలనుండి చేనేత హస్త కళా ఉత్పత్తులు సందర్శకులకు ఉదయం 10 .30 నుండి రాత్రి 8.00 గంటల వరకు అందుబాటులో ఉంటారు. రాజస్థాన్ కోట చీరలు, కోల్కతా జాంధానీ , తస్సార్, బెంగాల్ కాటన్, కాంత వర్క్, ఆంధ్రప్రదేశ్ కలంకారీ,మంగళగిరి,వేంకటగిరి, ఉత్తరప్రదేశ్ బనారస్, మస్లిన్, , గుజరాత్ బందీని, రాజకోట,అజ్రాక్, మొదలైన చీరలు సందర్శకులకు అందుబాటులో ఉన్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా బెంగళూరు నుండి విచ్చేసిన శ్రీమతి హరిప్రియ శిష్య బృందం చే భరతనాట్య ప్రదర్శనలో గణేశా స్తుతి, అల్లరిపు , శివాష్టకం, జగన్మోహన్, వీరిందవని వేణు, శివ పదం, శ్రీ చక్ర రాజా మొదలైన అంశాలను శ్రీమతి హరిప్రియ, అనూష, హేమ వర్షిణి, ప్రవల్లిక,నీరజ, కిరణశ్రీ,శ్రీలేఖ, జ్ఞాన సద్యుతి, మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.



### నూతన సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామిని సన్మానించిన మాజీ సర్పంచులు దేశిడి ప్రభావతి నరేందర్ రెడ్డి

**సంస్థాన్ నారాయణపురం, డిసెంబర్ 20( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం, రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీ ఒకటిగా నిలిచి 3,029, బంపర్ మెజార్టీతో గెలిచిన సిపిఐ పార్టీ బలపరిచిన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి ఉప్పల విజయలక్ష్మి లింగస్వామినీ సన్మానించిన మాజీ సర్పంచులు దేశిడి ప్రభావతి నరేందర్ రెడ్డి అనంతరం నూతనంగా ఉప సర్పంచ్ గా పల్లె మల్లారెడ్డి ని ఎన్నికైన వారిని మాజీ సర్పంచులు దేశిడి ప్రభావతి నరేందర్ రెడ్డి సన్మానించారు. అనంతరం సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి మాట్లాడుతూ మీ ఆశీస్సులతో మీ ఆలోచనలతో ముందుకు సాగుతూ గ్రామ అభివృద్ధికి తోడ్పడతానని అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ కోనెరెడ్డి నరసింహ, మాజీ ఎంపిటిసి రుద్ర రాములు, మురారి శెట్టి వెంకటేష్, పందుల వెంకటేష్, గడ్డం యాదగిరి, రాపర్తి శేఖర్, బాలగోని యాదయ్య, గురుగంటి రాజు, తదితరులు పాల్గొన్నారు.

### జి హెచ్ ఎం సి ఎస్ ఎఫ్ ఎ అసోసియేషన్ సర్వ సభ్య సమావేశం..



**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** జి హెచ్ ఎమ్ సి ఎస్ఎఫ్ఎ అసోసియేషన్ చందానగర్ లో సర్వ సభ్య సమావేశంను శనివారం రోజు నిర్వహించారు. పారిశుధ్య పనుల నిర్వహణ, పలు సమస్యలపై చర్చించారు. చలి విపరీతంగా పెరిగిన నగర పరిశుభ్రత కోసం ఉదయమే లేచి అంకిత భావంతో వృత్తిలో భాగంగా పని చేస్తున్న కార్మికుల సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ చందానగర్ శాఖ అధ్యక్షులు సయ్యద్అజారుద్దీన్, గురు చరణ్, ఆంజనేయులు, సంతోష్ ,శ్యామ్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు

## సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామిని సన్మానించిన బీసీ సంక్షేమ యువజన సంఘం నాయకులు



**సంస్థాన్ నారాయణపురం, డిసెంబర్ 20(ప్రభాత సూర్య) :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం గ్రామ సర్పంచిగా భారీ మెజార్టీతో విజయం సాధించడంతో శనివారం మండల కేంద్రంలోని వారి నివాసంలో గ్రామ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి లను ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియ జేశారు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గణం నరసింహ కురుమ. ఈ సందర్భంగా గణం నరసింహ కురుమ మాట్లాడుతూ మా మిత్రుడు క్లాస్ మెంట్ అయిన ఉప్పల లింగస్వామి గత ఎన్నికల్లో నారాయణపురం సర్పంచిగా పోటీ చేసి ఒక్క ఓటుతో ఓడిపోవడం జరిగింది. అయినప్పటికీ ఆయన మొక్కవోని ధైర్యంతో నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజల కష్టసుఖాలలో పాలు పంచుకుంటూ అనేక సేవా, సహాయ, సహకారాలు అందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆపదలలో ఉన్న వారికి నేనున్నా అంటూ ముందుకు వచ్చి వారికి ధైర్యాన్ని కలిగిస్తూ సహాయ సహకారాలు చేయడం వల్లనే ఇప్పుడు జరిగినటువంటి ఎన్నికల్లో రాష్ట్రం లోనే అత్యధిక మెజార్టీ ఓట్లు వేసి గెలిపించుకున్నారని ఆయన అన్నారు. ఈ సర్పంచి పదవితో మరింత బాధ్యత పెరిగిందని గతంలో గానే రాజకీయాలకు అతీతంగా అందరికీ అందుబాటులో ఉండి నారాయణ పురం గ్రామాన్ని అభివృద్ధి దిశగా ప్రయాణించేలా తమ కార్యక్రమాలు నిర్వహించాలని వారికి సూచించారు.ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి అనంత చంద్రశేఖర్ గౌడ్, బీసీ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పాలకూరి కిరణ్ గౌడ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతకింది స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ ను కలిసి ప్రసాదం అందజేసిన సీనియర్ నాయకుడు తిరుమలేష్....

**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి వర్యులు, సిరిసిల్ల శాసనసభ్యుడు తారకరామారావును శనివారం నంది నగర్ లో వారి నివాసంలో బిఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకర్గ సీనియర్ నాయకుడు గుర్ల తిరుమలేష్ మర్యాదపూర్వకంగా కలిసి శబరిమల అయ్యప్ప ప్రసాదం అందజేశారు.



## అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్న లాయిన్స్ క్లబ్ సభ్యులు



**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య:** హెూప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న అన్న ప్రసాద భోజన కార్యక్రమం 163 పూర్తి చేసుకుంది. 163 వ శనివారం అన్మదాన కార్యక్రమంలో సుమారు 2600 వేల మందికి హెూప్ పౌండేషన్ అన్నే అపర్ణా అన్నదానం చేశారు. హెూప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం చేపడుతున్న అన్నదానం కార్యక్రమం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. నిత్యం పనులు చేసుకుంటూ జీవనం గడిపే తమకు ప్రతి వారం ఉచిత భోజనం అందజేయడం పట్ల హెూప్ ఫౌండేషన్ చైర్మెన్ కొండ విజయ్ కుమార్ కు ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు. చందానగర్ గంగారం లో పని చేస్తున్న ప్రతి ఒక్కరు భోజనం చేస్తున్నారని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యుల గాలి కృష్ణ, మధుసూధన్ రెడ్డి, మారం ప్రసాద్, విష్ణు , ప్రవీణ్ రెడి, అన్నె సందీప్, హెూప్ ఫౌండేషన్ సభ్యులు శంకర్,షర్ఫుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు నష్టం చేసే విద్యుత్ చట్ట సవరణను విరమించు కోవాలి

### డిసెంబర్ 23న జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు

### రైతు సంగం నాయకులు గొల్లపల్లి జయరాజు

**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి డిసెంబర్ 20 :** రైతులకు నష్టం చేసే విద్యుత్ చట్ట సవరణ బిల్లును విరమించు కోవాలని రైతు సంగం జిల్లా ఉపాధ్యక్షుడు గొల్లపల్లి జయరాజు ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. నేడు సంగారెడ్డి లో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతూ కొత్త విద్యుత్ చట్టం కార్పొరేట్ కంపెనీలకు లాభాలు తెచ్చేదిగా ఉన్నదని అన్నారు. దీనికి వ్యతిరేకంగా డిసెంబర్ 23న జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేయాలని అన్నారు.తరతరాలుగా పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దుచేసి లేబర్ కోడ్‌లను తీసుకురావటం ద్వారా కేంద్రం బడా కార్పొరేట్లకు మేలు చేకూర్చుతున్నదని విమర్శించారు. విద్యుత్ సవరణ బిల్లు ద్వారా రైతాంగానికి, నిరుపేదలకు ఇస్తున్న క్రాస్ సబ్సిడీని ఎత్తివేసేందుకు కుట్రలు పన్నుతున్నదని తెలిపారు. రైతాంగ పోరాట ఫలితంగా రద్దు చేసిన మూడు వ్యవసాయ చట్టాల అమలులో భాగంగానే నూతన విత్తన బిల్లును కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందనీ, విదేశీ స్వదేశీ కార్పొరేట్లకు వ్యవసాయ రంగాన్ని ధారాదత్తం చేసేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. ఈ దుష్ట చర్యకు వ్యతిరేకంగా వ్యవసాయ కార్మికులు, కార్మికులు, మహిళలు , యువజన సంఘాలు కలిసిరావాలని కోరారు. ఈ కార్యక్రమం లో రైతు సంగం జిల్లా అధ్యక్షులు రాజయ్య, కార్యదర్శి యాదవ రెడ్డి, నాయకులు నర్సింహా రెడ్డి, శ్రీనివాస్, మాణిక్ రెడ్డి,మల్లారెడ్డి, విట్టల్, అశోక్, అంజయ్య లక్ష్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల అండ సిఐటియు జెండా

### పోరాటల ద్వారానే హక్కులు సాధ్యం.

### ఎస్ బి ఆర్గానిక్ లో సీఐటీయూ జెండా ఆవిష్కరణ.

### :జిల్లా కోశాధికారి, యూనియన్ అధ్యక్షుడు కే రాజయ్య.






**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి డిసెంబర్ 20 :** హత్నూర మండలంలోని ఎస్ బి ఆర్గానిక్ పరిశ్రమలో సిఐటియూ జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది, దీనికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా కోశాధికారి యూనియన్ అధ్యక్షుడు కే. రాజయ్య హాజరై జండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ కార్మికలకు అండగా సిఐటియు జెండాని ఆయన అన్నారు, పోరాడితేనే హక్కులు వస్తాయని ఆయన అన్నారు. దేశంలోనే కార్మికుల సమస్యలపై అవిశ్రాంత, సమరసిల పోరాటలు నిర్వహిస్తున్న ఏకైక సంఘం సీఐటీయూ అని ఆయన అన్నారు. కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సంఘం సీఐటీయూ అని, దేశంలో ఐక్య ఉద్యమాల సారథి సిఐటియు అని ఆయన అన్నారు. ప్రైవేటికరణ నుంచి మొదలుపెట్టి ప్రతి సమస్యపై పోరాటంలో సిఐటియు అగ్రభాగాన ఉంటుందని ఆయన అన్నారు. ప్రత్యేకంగా ఇటీవల కాలంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక చర్యలు ఉధృతం అయ్యాయని అన్నారు, కార్మిక చట్టాలన్నీ రద్దు చేయడం చాలా దుర్మార్గమని ఆయన అన్నారు. స్వాతంత్ర్యం రాకముందు ఉన్న పరిస్థితి మరోసారి భారతదేశంలో వస్తుందని ఆయన అన్నారు, కార్మిక వర్గం అంతా ఐక్యమై ఐక్య పోరాటాల ద్వారా తిప్పే కొట్టకపోతే భవిష్యత్తు ఉండదని ఆయన అన్నారు, లేబర్ కోడ్ లను ఎట్టి పరిస్థితిలో రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సాయిలు, జిల్లా ఉపాధ్యక్షుడు మాణిక్యం, జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి తదితరులు ప్రసంగించారు. యూనియన్ జనరల్ సెక్రెటరీ యాదగిరి నాయకులు శ్రీరాములు, చంద్రారెడ్డి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రసన్న వరల్డ్ ఇవాంజలిజం మినిస్ట్రీస్ చర్చి ని ప్రారంభించిన తుమ్మల యుగంధర్



**ఖమ్మం(సూర్య ప్రతినిధి):** ఖమ్మం నగరం 28 వ డివిజన్ ప్రకాష్ నగర్ లో మధు హెప్సిబా వారిచే నూతనంగా ఏర్పాటు చేసిన ప్రసన్న వరల్డ్ ఇవాంజలిజం మినిస్ట్రీస్ చర్చి ని శనివారం కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు ముఖ్య అతిథిగా డాక్టర్ తుమ్మల యుగంధర్ పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ గజ్జెల లక్ష్మి వెంకన్న, కాంగ్రెస్ నాయకులు పత్తికొండ శ్రీనివాసులు కలిమెల భద్రం ఖమ్మం పట్టణ పోస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు వేముల సత్యం ఉపేందర్ కరుణాకర్ రాము తదితరు పాల్గొన్నారు.

# విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలి





- విద్యార్థులే దేశానికి పట్టుకొమ్మలు
- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ
- ప్రభుత్వ పాఠశాలలో అపార అనుభవమున్న ఉపాధ్యాయులున్నారు
- డీఈఓ కే సత్యనారాయణ

**చౌటుప్పల్.డిసెంబర్ 20. ప్రభాత సూర్య :** విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని ఎంచుకొని ప్రణాళిక బద్ధంగా చదువుతూ లక్ష సాధనకు కృషి చేయాలని, విద్యార్థులే దేశానికి పట్టుకొమ్మలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి. జయశ్రీ తెలిపారు శనివారం మండల విద్యాధికారి గోలి శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ తుపాకుల రవి,యాదాద్రి జిల్లా డీఈవో సత్యనారాయణలతో కలిసి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ 9 జెడ్పి పాఠశాలలకు చెందిన 321 మంది పదో తరగతి విద్యార్థులకు రూ. 1.80 లక్షల విలువైన స్నాక్స్, నీళ్ల సీసాలు, పరీక్ష ప్యాడ్లు, పెన్నులు ఆమె చేతుల మీదుగా సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేలు గ్రామంలో శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ మాట్లాడుతూ... విద్యార్థులు క్రమశిక్షణ, సమయస్ఫూర్తితో మెలిగి ఏకాగ్రతతో విద్యాభ్యాసం చేసి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు ఆమే ఉద్బోధించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న 10వ తరగతి విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు రిలయబుల్ ట్రస్ట్ ముందుకొచ్చినందుకు వారికి అభినందనలు తెలిపారు. విద్యార్థులకు పోషకాహారంతోనే ఆరోగ్యం లభిస్తుందని అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే ఉత్తమ ఫలితాలు సాధించగలుగుతారని అన్నారు. అనంతరం డి. ఈ.ఓ సత్యనారాయణ మాట్లాడుతూ.. చదువు సంస్కారం నేర్పుతోందని తెలిపారు. పన్నెండేళ్ల కాలం లక్ష్యసాధన కోసం పట్టుదలతో విద్యాభ్యాసం చేస్తే జీవితమంతా సంతోషంగా ఉండవచ్చునని తెలిపారు. ఈ దశలో విద్యార్థులు ఇప్పుడు చదువును నిర్లక్ష్యం చేస్తే జీవితమంతా కష్టపడాల్సి వస్తుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో అపార అనుభవం ఉన్న ఉపాధ్యాయులు ఉన్నారని, వారి విజ్ఞానాన్ని వినియోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థానానికి ఎదగాలని ఉద్బోధించారు. అలాగే ఎంపీడీవో ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ... గ్రామీణ విద్యార్థుల సమస్యలను తాను ప్రత్యక్షంగా చూస్తున్నానని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని చెప్పారు. రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవి మాట్లాడుతూ తాను ప్రభుత్వ నవోదయ విద్యా లయంలో చదువుకున్నానని తెలిపారు. తల్లిదండ్రులు గర్వించే స్థాయికి పిల్లలు ఎదగాలని సూచించారు. "నీలాగా నీ పొరుగు వాడిని ప్రేమించు నీకున్న దాంట్లో పదిమందికి సహాయపడు" అని చర్చి ఫాదర్ చెప్పిన బోధనను నా గుండెలో పదిలపరుచుకుని, నా మిత్రులతో కలిసి రిలయబుల్ ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు, వృద్ధులకు, అనాధలకు, నిర్భాగ్యులకు సహకారం అందిస్తున్నామ ని తెలిపారు. పాఠశాలలో నూరు శాతం హాజరు ఉన్న విద్యార్థులకు డీఈఓ కే సత్యనారాయణ తన చేతుల మీదుగా బహుమతులను అందజేసి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమం లో జెడ్పి ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రమాదేవి, దీపా జోషి, హనుమంతు, ఉదయ, అశోక్, రఘుమారెడ్డి, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక చర్యలు: పి. ప్రావీణ్య, జిల్లా కలెక్టర్

### జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రవాణా శాఖ మంత్రి






ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి డిసెంబర్ 20:ఎరోడ్డు భద్రత మాసోత్సవాల నిర్వహణకు, ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. శనివారం రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రవాణా శాఖ కార్యదర్శి ఇల్లంబర్తి, ఆర్టీసీ ఎండి నాగిరెడ్డి, లా అండ్ ఆర్డర్ డిజి మహేష్ భగవత్ లతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చే నెలలో జరగనున్న జాతీయ రహదారి భద్రతా - 2026, మాసోత్సవాలపై సమీక్ష నిర్వహించారు. ఆయా జిల్లాలలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణ కోసం చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్లతో మంత్రి సమీక్షించారు. రోడ్డు భద్రత వారోత్సవాలపై అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించాలని రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు నివారించడానికి రోడ్ సేఫ్టీ మాసంలో విద్యార్థులను , ఉద్యోగులను, వివిధ సంస్థలను భాగస్వామ్యం చేసేలా వారికి అవగాహన సదస్సు లు తదితర అంశాల పై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలో రెండు జాతీయ రహదారులైన 65, 161 జాతీయ రహదారి లలో ప్రమాదాల నివారణ కోసం అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా నేషనల్ హైవే%-%65పై రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రమాదాల నివారణ కోసం పనులు జరుగుచున్న చోట రేడియం స్టిక్కర్లు, ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలలలో రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది జిల్లాలో ప్రమాదాలు సంఖ్య తగ్గుతుందన్నారు . జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు అర్ధరాత్రి తర్వాత తెల్లవారుజామున జరుగుతున్నాయని వాటి నివారణ కోసం రాత్రిపూట పోలీసు గస్తీ ఏర్పాటు చేసి వాహనాల తనిఖీ నిర్వహించడం, డ్రైవర్లకు ఆల్కహాల్ పరీక్షలు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రఘునందన్ రావు, ఆర్ అండ్ బి ఈఈ రాంబాబు , టీజీఎస్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ డి విజయ్ భాస్కర్, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ సంక్షేమ అధికారి విశాలాక్షి, డిటిఓ, అరుణ, బీసీ వెల్ఫేర్ సంక్షేమ అధికారి జగదీష్, ఈ డి ఎస్ సి కార్పొరేషన్ రామాచారి, ఆర్టిఏ మెంబర్ షేక్ తాహీర్ భాష, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రిపుల్ ఐటీ లో సీటు పొందిన బీసీ గురుకుల విద్యార్థి

### విద్యార్థిని అభినందించిన ఎంజేపీటీ బాలుర ప్రిన్సిపల్ శిరీష



**చౌటుప్పల్. డిసెంబర్ 20. ప్రభాత సూర్య :** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలం, తూప్రాన్ పేట గ్రామ పరిధిలోని ఎంజేపీటీ బాలుర పాఠశాల, కళాశాలలో 2023 -25 విద్యా సంవత్సరంలో ఎంపీసీ గ్రూపులో 963 మార్కులతో విద్యను పూర్తి చేసుకొని ట్రిబుల్ ఐటీ లో సీటు పొందిన విద్యార్థి ఆంగోతు సునీల్ కుమార్ నాయక్ ను ఎంజేపీటీ పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ శిరీష శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థిని అభినందించారు. యాదాద్రి జిల్లా, నారాయణపురం మండలం,పోర్లగడ్డ తాండ గ్రామానికి చెందిన అంగోతు సునీల్ కుమార్ నాయక్ ఎంపీసీ గ్రూపులో 963 మార్కులతో ఉత్తీర్ణత సాధించి గత సంవత్సరం జరిగిన ట్రిబుల్ ఐటీప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి కేరళ కొట్టాయంలో ట్రిబుల్ ఐటీ కళాశాలలో సీటు సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ శిరీష మాట్లాడుతూ... విద్యార్థులు భవిష్యత్తులో బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, తద్వారా కన్న తల్లిదండ్రులకు, విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు, ఎంజేపీటీ సొసైటీ కి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. బీసీ గురుకులంలో చదివిన విద్యార్థి సునీల్ కుమార్ నాయక్ ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని చదవాలని సూచించారు. బీసీ గురుకులాల్లో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు నేడు ఉన్నత స్థానాలలో స్థిరపడ్డారని గుర్తు చేశారు. అనంతరం తెలుగు లెక్చరర్ రవికుమార్ మాట్లాడుతూ... విద్యార్థి సునీల్ కుమార్ నాయక్ మన కళాశాలలో ఇంటర్ విద్యను మంచి మార్కులతో పూర్తి చేసుకొని ట్రిబుల్ ఐటీలో సీటు సాధించి రావడం గర్వకారణం అని తెలిపారు. అనంతరం విద్యార్థి ఆంగోతు సునీల్ కుమార్ నాయక్ మాట్లాడుతూ..ఈ కార్యక్రమంలో ఏటీపీ షబానా బేగం,లెక్చరర్స్ అన్వర్ ఉన్నిసా,లీల, పాఠశాల అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన జీ రామ్ జీ బిల్లు గ్రామీణ భారతానికి మరణ శాసనం

## 2005 మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని కొనసాగించాలి

## జీ రామ్ జీ 2025 బిల్లును వెంటనే రద్దు చేయాలి

## వ్యవసాయ కార్మిక సంఘం రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకుల (వక్తల) డిమాండ్



**భువనగిరి, డిసెంబర్ 20(ప్రభాత సూర్య):** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ-2005 చట్టాన్ని రద్దుచేసి కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన " వికసిత్ భారత్, గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజివితా మిషన్, జీ రామ్ జీ బిల్లును తీసుకువచ్చి గ్రామీణ భారతానికి మరణ శాసనం రాశారని ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం 2005 - మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని కొనసాగించి, జీ రామ్ జీ 2025 బిల్లును వెంటనే రద్దు చేయాలి తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా, టి.పి.సి.సి రాష్ట్ర కార్యదర్శి తంగపల్ల రవికుమార్, పిఎంసి రాష్ట్ర కార్యదర్శి సురుపంగ శివలింగం, బి.ఎస్.పి రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టు రామచంద్రయ్య మాట్లాడుతూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. శనివారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య భవన్, భువనగిరిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంను కొనసాగించాలని, మోడీ ప్రభుత్వం తెచ్చిన జీ రామ్ జీ బిల్లును రద్దు చేయాలని కోరుతూ జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి అధ్యక్షతన " రౌండ్ టేబుల్ " సమావేశం నిర్వహించగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ గ్రామీణ పేదల అభ్యున్నతికి, ఉపాధికి ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేదలకు ఎంతో ఉపయోగపడ్డదని అన్నారు. గ్రామీణ సంక్షోభ సమయాల్లో కూడా ఉపాధి హామీ పథకం కీలక పాత్ర పోషించిందని అన్నారు. దేశవ్యాప్తంగా 30 కోట్ల మందికి పైగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బలహీనవర్గాలకు ఉపాధి కల్పించే ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చడం తగదని విమర్శించారు. కొత్త చట్టంలో పనికి హామీ లేదని, చెల్లింపులకు బాధ్యతకు కూడా లేదని, ఈ చట్టం ద్వారా కేంద్ర ప్రభుత్వము తమ ఇష్టం వచ్చిన రీతిలో వ్యహరించడానికి అవకాశం ఉందని అన్నారు. ఈ కొత్త చట్టం అమలు అయితే ఉపాధి హామీలో ఉన్న పథకాలు, నిబంధనలు, మార్గదర్శకాలు అన్ని రద్దవుతాయని ఆవేదన వెలిబుచ్చారు. కొత్త చట్టం ప్రకారం అమలు చేసే పతకము కేంద్ర ప్రాయోజిత పథకం తప్ప ఇది ప్రజలకు ఉపయోగపడదని, ఇది మొత్తం కేంద్రం చేతిలో ఉంటుందని, ఏ రాష్ట్రానికి ఎంత నిధులు ఇవ్వాలని ఇవ్వకూడదు నిర్ణయం చేసే అధికారం కూడా కేంద్రానిదే ఉంటుందని అన్నారు. 90 శాతం బాధ్యతగా గత చట్టంలో ఉంటే 60 శాతానికి కుదించారని, కూలీల ప్రాధాన్యత తగ్గించి యంత్రాలకు, మెటీరియల్ కు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని విమర్శించారు. మోడీ ప్రభుత్వము గత పది సంవత్సరాలుగా ఈ చట్టానికి నిధులు తగ్గిస్తూ, త కొత్త జీవోలు తెచ్చి కార్మికులను భయభ్రాంతులకు గురిచేసిందని విమర్శించారు. ప్రధాని మోడీకి ఈ పథకము ఉండడం ఇష్టం లేదని అన్నారు. గాంధీజీని చంపిన గాడ్సే వారసులు ఆర్ఎస్ఎస్ మనువాద భావజాలంతో మహాత్మా గాంధీజీ పేరుతో ఉన్న చట్టాన్ని రద్దు చేయడం చాలా దారుణం అని అన్నారు. 2005 ఉపాధి చట్టానికి ఇప్పటి బిల్లు తేడా చూస్తే మోడీ రాజకీయ ఎజెండా ఏమిటో అర్థమవుతుందని ఇది గ్రామీణ భారతాన్ని ఆకలితో చంపే కుట్రగా అనిపిస్తుందని వారు అన్నారు. గ్రామీణ ఉపాధి పని దినాలకు ఉపాధి చట్టం ద్వారా కొంతమేరకైనా పని దొరికిందని వ్యవసాయ పనులు వేతనాలపై సానుకూల ప్రభావం కలిగించిందని కూలి రేట్లు పెంచుకోవడానికి శక్తి వచ్చిందని అన్నారు. పురుషులతోపాటు మహిళలకు కూడా వేతనాలు సమానంగా ఇచ్చారని అన్నారు. కానీ జీ రామ్ జీ చట్టంలో అనేక లోపాలతో గ్రామీణ పేదల యొక్క ఉపాధిని తగ్గించడం, చట్టాన్ని ఎత్తివేయడం, పని లేకుండా చేయడం, రాష్ట్రాల హక్కులను హరించడం లాంటివి చూస్తుంటే గ్రామీణ పేదలకు ఉపాధి లేకుండానే చేయాలని ఉద్దేశంతో మోడీ ప్రభుత్వం చూస్తున్నదని కార్పోరేట్ శక్తులు తప్ప పేదలు కార్మికులు అసంఘటి కార్మికులు రైతాంగము ఈ ప్రభుత్వానికి అంటి ముట్టనట్టు ఉన్నదని విమర్శించారు. ఇప్పటికైనా అన్ని వర్గాల ప్రజలు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్ట పరిరక్షణ కోసం, జీ రామ్ జీ బిల్లు రద్దు కోసం ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత సేన రాష్ట్ర అధ్యక్షులు పల్లెర్ల వెంకటేష్, టెక్నికల్ అసిస్టెంట్ సంఘం జిల్లా అధ్యక్షులు కొండమడుగు రమేష్, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బర్రె సుదర్శన్, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజు, సిఐటియు జిల్లా అధ్యక్షులు కొమటిరెడ్డి చంద్రారెడ్డి, తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా అధ్యక్షులు కాషపాక మహేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, పిఎన్ఎం జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, ఎల్.ఎచ్.పి.ఎస్ జిల్లా అధ్యక్షులు భాస్కర్ నాయక్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, చీమల కొండూరు సర్పంచ్ పల్లెర్ల అంజయ్య, సిపిఎం భువనగిరి పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ, కేవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు యాదగిరి, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు యండి సలీం, వ్యవసాయ కార్మిక సంఘం కమిటీ సభ్యులు సిలివెరు ఎల్లయ్య, కొండపురం యాదగిరి, బొల్లెపల్లి కిషన్, రాంబాబు, రాజన్ బాబు తదితరులు పాల్గొన్నారు.



## రజక సర్పంచ్ లను సన్మానించిన తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం నాయకులు



**సంస్థాన్ నారాయణపురం, డిసెంబర్ 20(ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలో రజక సర్పంచులను సన్మానించిన తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం నాయకులు. నారాయణపురం సర్పంచ్ గా 3029 ఓట్ల భారీ మెజార్టీతో గెలిచినఉప్పలవిజయలక్ష్మి లింగస్వామి ని, సర్వేల్ గ్రామ సర్పంచిగా 789 ఓట్ల మెజార్టీతో గెలుపొందిన చిలకరాజు చందన రాజు ని,వాయిల్లపల్లి గ్రామ సర్పంచిగా 350 ఓట్ల మెజార్టీతో గెలుపొందిన ఐతరాజు సరళ చంద్రయ్య లను ఘనంగా సన్మానించిన తెలంగాణ రజక%o% వృత్తిదారుల సంఘం నాయకులు.ఈకార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ళ ఆశయ్య చౌటుప్పల్ మండల మున్సిపల్ అధ్యక్షులు బాతారాజు రాజు యాదగిరి,కానుగు బాలరాజు, ప్రధాన కార్యదర్శి చామాకుర యాదయ్య,బాతరాజు దశరద, ఉపాధ్యక్షులు మాలిగే నరసింహ, బొల్లారం లక్ష్మీనారాయణ,కానుగు శివకుమార్, వెంకటేష్ పెదకంటి లింగస్వామి, బాతరాజు యాదయ్య, నారాయణపురం మండల కన్వీనర్ రాచకొండ రమేష్, పొన్నం మారయ్య, రాచకొండ శ్రీనివాస్ తదితరులు పాలుగోన్నారు.

## బాలానగర్ లో ఘనంగా ముదిరాజ్ జెండా పండుగ

### ముదిరాజ్ లు అందరూ ఏకతాటిపై ఉండి ఐక్యతను చాటుకోవాలి

### బాలానగర్ డివిజన్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఆకుల నరేందర్



**బాలానగర్, డిసెంబర్ 20 (ప్రభాత సూర్య) :** కూకట్ పల్లి నియోజకవర్గం, బాలానగర్ డివిజన్ ముదిరాజ్ సంఘం బాలానగర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఆకుల నరేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ముదిరాజ్ బస్తి దగ్గర ముదిరాజ్ జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. అనంతరం ముదిరాజ్ సంఘం సభ్యులు జెండాను ఆవిష్కరించి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాలానగర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఆకుల నరేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజ్ సంఘం సభ్యులు ఏకతాటిపై ఉండి ప్రతి రంగాలలో ముదిరాజులు అగ్రస్థానంలో ఉండాలని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ముదిరాజుల ఐక్యత చాటి రాజ్యాధికారాన్ని దక్కించుకోవాలని అన్నారు. ముదిరాజులకు ఏ సమస్య వచ్చినా తాను ముందుండి పోరాడుతానని ఆకుల నరేందర్ తెలిపారు.

## నజ్జీక్ సింగారం ఉపసర్పంచ్ గా వన్నవాడ రవీందర్ రెడ్డి

### గ్రామ అభివృద్ధికి కృషి

### గ్రామంలో కనీసం మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తాం: రవీందర్ రెడ్డి వెల్లడి




ఇబ్రహీంపట్నం,డిసెంబర్ 20, ప్రభాత సూర్య:రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని నజ్జిక్ సింగారం గ్రామ ఉప సర్పంచ్ గా వన్నవాడ రవీందర్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈనెల 17న రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మూడో విడత సర్పంచ్ ఎన్నికలలో భాగంగా రవీందర్ రెడ్డి నజ్జిక్ సింగారం గ్రామంలో 8వ వార్డులో వార్డు సభ్యునిగా పోటీ చేసి సమీప ప్రత్యర్థి పై విజయం సాధించాడు. అనంతరం జరిగిన ఉపసర్పంచ్ ఎన్నికపై వార్డు సభ్యులు రవీందర్ రెడ్డి కి సానుకూలంగా మద్దతు ఇచ్చారు. దీంతో సింగారం ఉప సర్పంచ్ గా బిజెపి పార్టీ కి చెందిన వన్నవాడ రవీందర్ రెడ్డి నీ ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారి ఎన్నికల ధ్రువపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ .. గ్రామ అభివృద్ధిలో తాను కీలకంగా పనిచేస్తానని అన్నారు. గ్రామంలో కావాల్సిన మౌలిక సదుపాయాలు పాలకవర్గంతో కలిసి గ్రామ అభివృద్ధిలో భాగం పంచుకుంటామన్నారు. రవీందర్ ఎన్నికపై బిజెపి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా రేపు పాలకవర్గం ప్రమాణ స్వీకారం గ్రామపంచాయతీలో ఉంటుందని తెలిపారు.

# విద్యార్థులే దేశానికి పట్టుకొమ్మలు







## స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ

## ప్రభుత్వ పాఠశాలల్లో అపార అనుభవం ఉన్న ఉపాధ్యాయులు ఉన్నారు: డీఈవో సత్యనారాయణ

సంస్థాన్ నారాయణపురం, డిసెంబర్ 20( ప్రభాత సూర్య): విద్యార్థులే దేశానికి పట్టుబొమ్మలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి. జయశ్రీ తెలిపారు. క్రమశిక్షణ, సమయస్ఫూర్తితో మెలిగి ఏకాగ్రతతో విద్యాభ్యాసం చేసి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు ఆమె ఉద్భోదించారు. రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ తుపాకుల రవి, డీఈవో సత్యనారాయణలతో కలిసి 9 జెడ్పి పాఠశాలలకు చెందిన 321 మంది పదో తరగతి విద్యార్థులకు రూ.1.80 లక్షల విలువైన స్నాక్స్, నీళ్ల సీసాలు, పరీక్ష ప్యాడ్లు, పెన్నులు ఆమె చేతుల మీదుగా సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేలు గ్రామంలో శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న 10వ తరగతి విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు రిలయబుల్ ట్రస్ట్ ముందుకొచ్చినందుకు అభినందనలు తెలిపారు. పోషకాహారంతోనే ఆరోగ్యం లభిస్తుందని అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే ఉత్తమ ఫలితాలు సాధించగలుగుతారని అన్నారు. డి ఈ ఓ సత్యనారాయణ మాట్లాడుతూ, చదువు సంస్కారం నేర్పుతోందని తెలిపారు. పన్నెండేళ్ల కాలం లక్ష్యసాధన కోసం పట్టుదలతో విద్యాభ్యాసం చేస్తే జీవితమంతా సంతోషంగా ఉండవచ్చునని తెలిపారు. ఇప్పుడు చదువు నిర్లక్ష్యం చేస్తే జీవితమంతా చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో అపార అనుభవం ఉన్న ఉపాధ్యాయులు ఉన్నారని, వారి విజ్ఞానాన్ని వినియోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థానానికి ఎదగాలని ఉద్బోధించారు. ఎంపీడీవో ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ, గ్రామీణ విద్యార్థుల సమస్యలను తాను ప్రత్యక్షంగా చూస్తున్నానని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని చెప్పారు. రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవి మాట్లాడుతూ, తాను ప్రభుత్వ నవోదయ విద్యా లయంలో చదువుకున్నానని తెలిపారు. తల్లిదండ్రులకు గర్వకారకులుగా పిల్లలు ఎదగాలని సూచించారు. "నీలాగా నీ పొరుగు వాడిని ప్రేమించు. నీకున్న దాంట్లో పదిమందికి సహాయపడు" అని చర్చి ఫాదర్ చెప్పిన బోధనను నా గుండెలో పదిలపరుచుకుని, నా మిత్రులతో కలిసి రిలయబుల్ ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు, వృద్ధులకు, అనాధలకు, నిర్భాగ్యులకు సహకారం అందిస్తున్నామ ని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి గోలి శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. జెడ్పి ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రమాదేవి, దీపా జోషి, హనుమంతు, ఉదయ, అశోక్, రఘుమారెడ్డి, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నూరు శాతం హాజరు ఉన్న విద్యార్థులకు డీఈవో బహుమతులు అందజేశారు.





## మూత పడ్డ సూపర్ మాక్స్ కంపెనీలో విలువైన యంత్రాలు మాయం..

భారీ చోరీ జరిగినట్లు గుర్తింపు..

ఆందోళన చెందుతున్న కార్మికులు..

జీడిమెట్ల పీఎస్.లో ఫిర్యాదు చేసిన కార్మిక నాయకులు..

విలువ రూ 50 కోట్లకి పైగా ఉంటుందని ప్రాథమిక వెల్లడి..

**కుత్బుల్లాపూర్ డిసెంబర్ 20 (ప్రభాత సూర్య) :** జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని సూపర్ మాక్స్ పర్సనల్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ లో రూ.కోట్ల విలువైన యంత్ర సామాగ్రి చోరీకి గురైందని,ఈ మేరకు కార్మికులు జీడిమెట్ల పోలీస్ స్టేషన్లో కార్మికులు ఫిర్యాదు చేశారు.ఈ పరిశ్రమ మూడేళ్ల క్రితం మూతపడిందని,ప్రస్తుతం ఎన్.సి.ఎల్.టి (నేషనల్ కంపెనీస్ లా ట్రిబ్యునల్) పరిధిలో ఉంది.బ్లేడ్స్ తయారు చేసే యూనిట్ యంత్ర మిషినరీ లు మొత్తం మాయమైనట్టు



కార్మికులు ఫిర్యాదులో పేర్కొన్నారు.జీడిమెట్ల సిఐ.గడ్డం మల్లేష్ ఆదేశాల మేరకు క్రైమ్ సిబ్బంది పరిశ్రమను కార్మికులతో కలిసి పరిశీలించారు.దాదాపు పది లారీల్లో పట్టే అంత యంత్రాలు మాయమైనట్టు ప్రాథమికంగా గుర్తించారు.ఈ కంపెనీలో యజమాన్యానికి కార్మికులకు మధ్య కోర్టులో వివాదం నడుస్తుంది.బకాయిలు చెల్లించాలని కార్మికులు లేబర్ కోర్టును ఆశ్రయించారు.ఈ క్రమంలో విలువైన యంత్రాలు మాయం కావడం చర్చనీయాంశంగా మారింది.కంపెనీ సెక్యూరిటీ కి తెలియకుండా యంత్రాలు బయటకు ఎలా వెళ్లాయని యూనియన్ నాయకులు ప్రశ్నిస్తున్నారు.కాగా కార్మికులు ఇచ్చిన ఫిర్యాదును అధికారికంగా తీసుకోవడానికి తమకు అనుమతి లేదని జీడిమెట్ల సిఐ.గడ్డం మల్లేష్ తెలిపారు.ఎన్సిఎల్టి అధికారులు సోమవారం వచ్చి ఫిర్యాదు చేస్తామని తెలిపినట్టు పేర్కొన్నారు.మాయమైన యంత్రాల విలువ 50 కోట్లకు పైగా ఉంటుందని యూనియన్ జేఏసీ నాయకులు పేర్కొంటున్నారు.

## కౌన్సిల్ ఆఫ్ ఈహెచ్ఎస్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో 29వ ఉచిత శిక్షణా కార్యక్రమం



**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 20 (తర్వాత సూర్య):** కౌన్సిల్ ఆఫ్ ఈహెచ్ఎస్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో 29వ ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని జీడిమెట్ల ఇండస్ట్రీస్ అసోసియేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో విజయవంతంగా నిర్వహించారు. పరిశ్రమల్లో భద్రతా విధానాల బలోపేతం, పర్యావరణ



పరిరక్షణపై అవగాహన, ల్యాబొరేటరీ భద్రతా ప్రమాణాలు, ఇండస్ట్రియల్ గ్యాస్ టెస్టింగ్, ఫైర్ సేఫ్టీ, అలాగే ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లపై ఈ కార్యక్రమంలో నిపుణులు విస్తృతంగా అవగాహన కల్పించారు. పరిశ్రమలు ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లను దృష్టిలో ఉంచుకుని భద్రతా చర్యలను వ్యవస్థబద్ధంగా మరియు ముందస్తుగా అమలు చేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా వివరించారు.ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ బోర్డు మెంబర్ అశోక్ పొడిశెట్టి పాల్గొని, భద్రతను కేవలం నిబంధనల పరిమితికి కాకుండా సంస్థ సంస్కృతిలో భాగంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉద్యోగుల భద్రత, సంస్థ ఆస్తుల పరిరక్షణ, పర్యావరణ సంరక్షణకు మేనేజ్‌మెంట్ నాయకత్వం మరియు ఉద్యోగుల చురుకైన భాగస్వామ్యం అత్యంత కీలకమని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమానికి కౌన్సిల్ ఆఫ్ ఈహెచ్ఎస్ ప్రొఫెషనల్స్ జనరల్ సెక్రటరీ ఎ. సూర్య ప్రకాశ్తో పాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ హరి బుక్య, జి. జగదీశ్వరరావు, శ్రీ ఈ. తిరుపతి హాజరై పరిశ్రమలు ఎదుర్కొంటున్న ముఖ్యమైన ఈహెచ్ఎస్ సమస్యలపై చర్చల్లో పాల్గొన్నారు. వారి పాల్గొనడం సాంకేతిక చర్చలకు మరియు పరస్పర అభిప్రాయాల మార్పిడికి మరింత విలువను చేకూర్చింది.అదేవిధంగా రీసస్టైనబిలిటీ లిమిటెడ్ సంస్థకు చెందిన వైస్ ప్రెసిడెంట్ (బిజినెస్ ఆపరేషన్స్) ఆర్.కె.వి. నటరాజ్, బేసిక్ ఎలిమెంట్స్ సంస్థ డైరెక్టర్ ప్రసాద్ నిస్తాలాతో పాటు వారి సంస్థల అంశ నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొని, పరిశ్రమల అనుభవాల ఆధారంగా ప్రాయోగిక అంశాలను వివరించారు.ఈ శిక్షణా కార్యక్రమంలో 80కి పైగా కంపెనీలకు చెందిన ఈహెచ్ఎస్ మరియు పర్యావరణ నిపుణులు, ల్యాబొరేటరీ సిబ్బంది, సీనియర్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, అలాగే ఎస్ సి ఎం, హెచ్ ఆర్ విభాగాల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజలు, పర్యావరణం మరియు సంస్థల ఆస్తుల రక్షణలో సమూహ బాధ్యత అత్యంత కీలకమని బలమైన సందేశంతో కార్యక్రమం ముగిసింది. పరిశ్రమల్లో ఈహెచ్ఎస్ ఉత్తమతను ప్రోత్సహించే విశ్వసనీయమైన, నమ్మదగిన మరియు ప్రభావవంతమైన వేదికగా కౌన్సిల్ ఆఫ్ ఈహెచ్ఎస్ ప్రొఫెషనల్స్ తన పాత్రను మరింత బలపరిచిందని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా కౌన్సిల్ ఆఫ్ ఈహెచ్ఎస్ ప్రొఫెషనల్స్ అధ్యక్షులు తపస్ సహా మాట్లాడుతూ, గత 10 సంవత్సరాలుగా సి ఈ పి ప్రయాణం విజయవంతంగా కొనసాగడానికి సహకరించిన పరిశ్రమలు, ఫ్యాకల్టీలు మరియు అంశ నిపుణులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే విధమైన సహకారం కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ, సి ఈ పి లక్ష్యాలను మరింత విస్తృతంగా ముందుకు తీసుకెళ్లేందుకు అందరి సహకారం అవసరమని అన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలను తిప్పికోడదాం

చట్టాన్ని యధావిధిగా అమలు చేయాలి.

చట్ట పరిరక్షణకు ఊరూరా ఉద్యమం

తెలంగాణ రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు బి యాదవ రెడ్డి కే. రాజయ్య

సంగారెడ్డిలో "ఉపాధి చట్ట సవరణ" ప్రతులు దహనం



**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి డిసెంబర్ 20 :** ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర బిజెపి ప్రభుత్వం రద్దు చేసేందుకు కుట్రలు పన్నుతుందని, ఈ కుట్రలను తిప్పికొట్టేందుకు తెలంగాణ రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు బి యాదవ రెడ్డి కే. రాజయ్య పోరాడుతుందని, ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని లేనిపక్షంలో ఊరూరా ఉద్యమాన్ని చేపడుతామని అన్నారు.సంగారెడ్డి జిల్లా కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నూతనంగా తెచ్చిన "విబి-జి రాం జి పేరుతో ఉపాధి హామీ పథకం పత్రాలను దహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు యాదవ రెడ్డి రాజయ్య మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం సవరణలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు. ఈ చట్టాన్ని తిరిగి పునరుద్ధరించే వరకు పోరాటం సాగుతుందని స్పష్టం చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్రం చేస్తున్న సవరణలను రద్దు చేయాలన్నారు. చట్టబద్ధ హక్కుగా ఉన్న ఈ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. యుపిఎ ప్రభుత్వంపై వామపక్షాలు తీసుకువచ్చిన ఒత్తిడి ఫలితంగా రూపుదిద్దుకున్న మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ చట్టం మౌలిక స్వభావాన్ని కేంద్ర ప్రభుత్వం మారుస్తోందన్నారు. వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవిక మిషన్ (విబి-జి రాం జి) పేరుతో ఉపాధి హామీ పథకానికి "రాంరాం"పలకనుందన్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న విధంగా పని హక్కుగా ఉన్న పాతచట్టాన్ని మార్చి ఇదొక సాధారణ పథకంగా అమలు చేయనున్నారని తెలిపారు. సాధారణ పథకంగా దీనిని మారిస్తే, ఈ పథకం కొనసాగవచ్చు లేదా రద్దు చేయవచ్చు అన్నారు. ఇప్పటివరకు వ్యవసాయ కార్మికుల డిమాండ్ ను బట్టి ఉపాధి కల్పించే విధానాన్ని మార్చేసి అవసరాన్ని (సప్లయిని బట్టి పనులు పెట్టడం అంటే ఈ పథకం మౌలిక స్వభావాన్ని నిర్వీర్యం చేయడమేనని విమర్శించారు. కొత్త పథకంలో పనిదినాలు 100 నుండి 125 రోజులకు పెంచనున్నట్లు చెప్పడం ప్రజలను మభ్యపెట్టేందుకేనన్నారు. యంజిఎస్ఆర్ ఈజిఎగా ఉన్న ఈ పథకం పేరును మార్చడం మహాత్ముడిని అవమానించడమేనన్నారు. ఉపాధి హామీ పథకం అమలులో కీలకమైన రాష్ట్రాల భాగస్వామ్యం కొత్త బిల్లు వల్ల నామమాత్రంగా మారుతుందని చెప్పారు. అంతేకాకుండా మరోవైపు 10 నుండి 40 శాతానికి రాష్ట్రాలపై భారం పెంచారని వివరించారు. ఈ పథకం అమలుకు ఇప్పటివరకు కేంద్రం ఇస్తున్న 90 శాతం నిధులను 60 శాతానికి తగ్గించి రాష్ట్రాలపై వేల కోట్ల రూపాయల భారాలు మోపుతుందన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రమేష్ గౌడు జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి జిల్లా ఆఫీస్ బేరల్స్ మల్లారెడ్డి, శ్రీనివాస్ జిల్లా కమిటీ సభ్యులుమాణిక్య రెడ్డి,మల్లారెడ్డి అశోక్,అంజయ్య రామకృష్ణ, విట్టల్, భూషణం తది తరులు పాల్గొన్నారు.

## మేటిచందాపూర్ ఘటనపై బిఆర్ఎస్ కఠిన నిర్ణయం

### పార్టీ లైన్ క్రాస్ చేసిన నేతలపై సస్పెన్షన్‌కు కేటీఆర్ హర్షం



**మర్రిగూడ, సూర్య ప్రతినిధి :** మర్రిగూడ మండలం, మేటి చందాపురం( ఇందుర్తి) గ్రామంలో ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా పార్టీ నిర్ణయాలకు విరుద్ధంగా వ్యవహరించిన చెరుకు లింగం గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు ఐతగోని అశోక్ గౌడ్‌లను భారత రాష్ట్ర సమితి పార్టీ నుంచి సస్పెండ్ చేసిన విషయాన్ని, బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)కు మాజీ మంత్రి గుంటకంట్ల జగదీశ్వర్ రెడ్డి, మునుగోడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, ఇంచార్జి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి వివరించారు. ఈ సస్పెన్షన్ నిర్ణయాన్ని కేటీఆర్ హర్షించినట్లు వారు తెలిపారు. పార్టీకి నష్టం చేసే వారిపై, ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా స్పష్టం చేసినట్లు సమాచారం...గ్రామపంచాయతీ ఎన్నికల ఫలితాల అనంతరం, బిఆర్ఎస్ పార్టీ తన క్రమశిక్షణ వైఖరిని మరింత కఠినంగా అమలు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. మేటిచందాపూర్ గ్రామ పంచాయతీ తొలి విడత ఎన్నికల్లో పార్టీ అధికారిక అభ్యర్థిగా ఏరుకొండ అబ్బయ్యను మునుగోడు నియోజకవర్గ పార్టీ ఇంచార్జి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ప్రకటించారు. అయితే పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా, ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా వ్యవహరించారన్న ఆరోపణలు చెరుకు లింగం గౌడ్, ఐతగోని అశోక్ గౌడ్‌లపై వచ్చాయి. ఈ చర్యలే చివరకు అభ్యర్థి ఓటమికి దారితీశాయన్న భావన పార్టీ శ్రేణుల్లో బలంగా వ్యక్తమైంది.ఈ పరిణామాలు గ్రామస్థాయిలో తీవ్ర అసంతృప్తికి దారి తీసాయి. పార్టీ పరువు, క్రమశిక్షణకు భంగం కలిగిందని భావించిన బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఈ నెల 16న జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో పార్టీ నిర్ణయాలను బేఖాతరు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విస్తృతంగా చర్చించి, ఇరువురిని పార్టీ నుంచి బహిష్కరించాలంటూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.గ్రామస్థాయి తీర్మానాన్ని నియోజకవర్గ ఇంచార్జి దృష్టికి తీసుకెళ్లిన అనంతరం, ఆయన ఈ వ్యవహారాన్ని పార్టీ క్రమశిక్షణ కోణంలో సమీక్షించారు. పార్టీ నియమాలు అందరికీ సమానమేనని, పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా వ్యవహరించడం తీవ్రమైన పార్టీ వ్యతిరేక చర్యగా భావిస్తామని ఆయన స్పష్టం చేశారు. పదవులు, హోదాలు ఏవైనా సరే, క్రమశిక్షణ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని తేల్చిచెప్పారు. ఈ నేపథ్యంలో చెరుకు లింగం గౌడ్, ఐతగోని అశోక్ గౌడ్‌లను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు.ఈ నిర్ణయం మేటిచందాపూర్ గ్రామ రాజకీయాలకే కాకుండా, మర్రిగూడ మండలం వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. భవిష్యత్ ఎన్నికల్లో పార్టీ క్రమశిక్షణే కీలక ఆయుధమన్న స్పష్టమైన సంకేతాన్ని బిఆర్ఎస్ ఈ చర్య ద్వారా పంపిందన్న విశ్లేషణ వినిపిస్తోంది. గ్రామస్థాయి ఎన్నికలైనా, పార్టీ క్రమశిక్షణ విషయంలో రాజీ లేని వైఖరికి ఇది ప్రతీకగా నిలిచిందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.ఈ కార్యక్రమంలో పోటీలో పాల్గొన్న సర్పంచ్ అభ్యర్థి ఏరుకొండ అబ్బయ్య, మాజీ ఎంపీటీసీ సరిత నాగేష్‌తో పాటు పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## మానసిక పరిపక్వత తక్కువగా ఉన్న పిల్లలకు, వారి తల్లిదండ్రుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలి

దివ్యాంగుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యం కల్పించేలా జీవో ని తీసుకొచ్చాం

ఆ జీవోని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం

మానసిక వికలాంగుల విషయంలో ప్రభుత్వం స్పందించకపోతే నిరాహార దీక్ష చేపడతాం

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**కూకట్ పల్లి, డిసెంబర్ 20 (ప్రభాత సూర్య) :** ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు, వారి తల్లిదండ్రుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే నిరాహార దీక్షకు దిగుతానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. బోయినపల్లి మనో వికాస్ నగర్ లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిసెబిలిటీస్ (ఎన్ఐఈపీఐడీ)లో శిక్షణ పొందుతున్న ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు, వారి తల్లిదండ్రులతో కవిత సమావేశం అయ్యారు. ఇటీవల 'జాగృతి జనం బాట' కార్యక్రమంలో భాగంగా ఎన్ఐఈపీఐడీని సందర్శించిన కవిత శనివారం



జాగృతి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో చిన్నారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ మానసిక పరిపక్వత తక్కువగా ఉన్న పిల్లలకు ఏ ప్రభుత్వం వచ్చినా సరైన మేలు జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో మానసిక ఎదుగుదల తక్కువగా ఉన్న వారిని గతంలో దివ్యాంగులుగా పరిగణించలేదని, అయితే పార్లమెంట్లో పోరాటం చేసి 21 రకాల సమస్యలు ఉన్న వారిని దివ్యాంగులుగా గుర్తింపునిచ్చేలా చేశామని తెలిపారు.

తెలంగాణలో దివ్యాంగుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యం కల్పించేలా తానే పోరాటం చేసి జీవో తీసుకొచ్చినప్పటికీ, అది సరిగ్గా అమలు కావడం లేదని కవిత విమర్శించారు. మానసిక ఎదుగుదల తక్కువగా ఉన్న పిల్లల తల్లిదండ్రుల బాధలు తనకు తెలుసని, వారికి ఇళ్లు కూడా అద్దెకు దొరకని పరిస్థితి ఉందన్నారు. అందుకే వారికి డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సమస్యతో బాధపడుతున్న వారు దాదాపు లక్ష మంది వరకు ఉంటారని, వారందరికీ పెన్షన్ ఇవ్వగలిగే స్థితిలో ప్రభుత్వం ఉందని కవిత అన్నారు. ప్రతి ప్రభుత్వ పథకంలో మెంటల్లీ, ఫిజికల్లీ ఛాలెంజ్ ఉన్న పిల్లల తల్లిదండ్రులకు ప్రాధాన్యం ఇవ్వాలని, అలాగే భర్త చనిపోయిన మహిళలు, ఒంటరి మహిళలకు కూడా పెన్షన్ల విషయంలో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు.




# టీఆర్ఎస్ (డి) పార్టీ జిహెచ్ఎంసి ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల్లో పోటీ

## టీఆర్ఎస్ (డి) పార్టీ అధ్యక్షులు నరాల సత్యనారాయణ

**ఖమ్మం( సూర్య ప్రతినిధి):** టిఆర్ఎస్ (డి )పార్టీ రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలతో పాటు ఎంపీటీసీ జడ్పిటిసి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేస్తుందని పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నరాల సత్యనారాయణ పిలుపునిచ్చారు.డిసెంబర్ 28న హైదరాబాదులోని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాలో గల నేరేడ్మెట్ ప్రాంతంలో ఉన్న అంబేద్కర్ భవన్లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే రాష్ట్రస్థాయి విస్తృత సమావేశంలో కార్పొరేషన్ ఎన్నికల ప్రకటన చేయడం జరుగుతుందని రాష్ట్ర అధ్యక్షులు నరాల సత్యనారాయణ తెలియజేశారు. టిఆర్ఎస్ ( డి) పార్టీ ఆధ్వర్యంలో ఏర్పడిన తెలంగాణ పొలిటికల్ జేఏసీలో వివిధ రాజకీయ పార్టీలు కుల సంఘాలు ప్రజా సంఘాలు తెలంగాణ ఉద్యమకారుల సంఘాలు చేరినాయి కాబట్టి జనవరిలో తెలంగాణ ఉద్యమకారుల కోసం ఇందిరాపార్కు వద్ద 3000 మందితో జరిగే ధర్నాను విజయవంతం చేయాలన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ ( డి) జిల్లా ప్రధాన కార్యదర్శి తెల్లం రాణి జిల్లా ఉపాధ్యక్షురాలు పాల సృజన పాల్గొన్నారు.

# ఆందోళనకరంగా రూపాయి పతనం !

రోజురోజుకూ రూపాయి పతనం ఆందోళన కలిగిస్తోంది. అదేపనిగా దిగుమతులు పెంచుకోవడం, ఎగుమతులు తగ్గడం వంటి కారాణాలకు తోడు అంతర్జీతాయ పరిణామాల నేపథ్యంలో రూపాయి దిగజారుతోంది. ప్రపంచ మార్కెట్లో మన వస్తువుల ఉత్పత్తులు పెరిగితేనే మన విదేశీ మారక నిల్వలు పెరగడంతో పాటు, రూపాయి బలపడగలదు. అయితే గత దశాబ్దకాలంతో పోలిస్తే రూపాయి విలువ వందశాతం పడిపోయింది.

ఇప్పుడు డాలర్‌తో పోలిస్తే 91 రూపాయలకు చేరింది. ఇది మనకు గుదిబండగా మారినా పెద్దగా స్పందన రావడం లేదు. ఆర్థికవేత్తలు, ప్రభుత్వం దీనిపై సీరియస్‌గా దృష్టి సారించడం లేదా అన్న అనుమానాలు వస్తున్నాయి. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి యధేచ్ఛగా దిగజారుతూనే ఉంది. మంగళవారం డాలర్ మారకంలో రూపాయి విలువ మరో 15 పైసలు క్షీణించి ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయి 90.93 వద్ద స్థిరపడింది. అంతకు ముందు ఇంట్రాడేలో 36 పైసలు క్షీణించి జీవితకాల కనిష్ఠ స్థాయి 91.14 వరకు కూడా దిగజారింది. కేవలం 10 ట్రేడింగ్ సెషన్లలోనే డాలర్ మారకం లో రూపాయి 90 నుంచి 91 స్థాయికి పడిపోయింది. కేవలం ఐదు సెషన్లలోనే 1 శాతం మేరకు నష్టపోయింది. డాలర్ బలహీనత, క్రూడాయిల్ ధరల తగ్గుదల సైతం రూపాయి పతనాన్ని నిలువరించలేకపోయాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 1.54 శాతం దిగజారి 59.63 డాలర్లకు దిగివచ్చింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ నెలలోనే రూపాయి 92 కన్నా దిగజారవచ్చని ఫారెక్స్ ట్రేడర్లు అంచనా వేస్తున్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి భారత్ చేసిన కొత్త ప్రతిపాదనలను స్వీకరించేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంగీకరించలేదన్న వార్తలు రూపాయి మారకాన్ని ప్రభావితం చేశాయని ఫారెక్స్ ట్రేడర్లంటున్నారు. సరికొత్త ప్రతిపాదనలను భారత్ ఖరారు చేసే వరకు డీల్ నిలిచిపోయినట్టే అన్న భయాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశా యి. మరోపక్క రూపాయి పతనాన్ని నిలువరించేందుకు ఆర్‌బీఐ జోక్యం చేసుకోకపోవడం వల్ల విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు నిధులు ఉపసంహరించడం మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టయింది.ఇదిలా ఉండగా 2027 జూన్ నాటికి రూపాయి 92–94 స్థాయికి దిగజారవచ్చని యాక్సిస్ బ్యాంక్ చీఫ్ ఎకనామిస్ట్ నీలకంఠ్ మిశ్రా అంచనా వేస్తున్నారు. అయితే రూపాయి ఎంత దిగజారినా మనం భయపడాల్సిందేమీ లేదన్నది ఆయన అభిప్రాయంగా ఉంది. మనం 68,500–69,000 కోట్ల డాలర్ల భారీ విదేశీ మారకపు నిల్వలతో అత్యంత శక్తివంతంగా ఉన్నామని ఆయన అన్నారు. ఈ ఏడాది డిసెంబరు 3వ తేదీ వరకు రూపాయి విలువ 5.1 క్షీణించిందని కేంద్రమంత్రి పంకజ్ వెల్లడించారు. రూపాయి విలువ ఇంతగా పడిపోవడానికి వాణిజ్య లోటే కారణమని ప్రభుత్వం చెబుతోంది. రూపాయి నిరంతర పతనం అంశాన్ని కొందరు సభ్యులు రాజ్యసభలో ప్రస్తావించగా ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదురి ఈ ప్రకటన చేశారు. ఈ ఏడాది రూపాయి విలువను వాణిజ్య లోటు, అమెరికాతో వాణిజ్య ఒప్పందం ప్రభావితం చేశాయని మంత్రి చెప్పారు. రూపాయి విలువ క్షీణత వల్ల ఎగుమతి రంగం పోటీ సామర్థ్యం పెరుగుతుందని ఆయన అన్నారు. ఇదే సమయంలో దిగుమతుల విలువ పెరగవచ్చని కూడా ఆయన అంగీకరించారు. రూపాయి విలువను మార్కెట్ నిర్ణయిస్తుందని, దానికి ఎలాంటి లక్ష్యాన్ని నిర్దేశించలేదని మంత్రి స్పష్టం చేశారు. అయితే రూపాయి కదలికలను ఆర్‌బీఐ నిరంతరం ట్రాక్ చేస్తున్నదని, ఆటుపోట్లు తీవ్రంగా ఉంటే అవసరమైన మేరకు జోక్యం చేసుకుంటుందని ఆయన చెప్పారు. అయితే డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ మరింత క్షీణించే అవకాశం ఉందని, అయితే దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కొందరు వాదిస్తున్నారు. ఫార్వర్డ్స్ మార్కెట్‌లో ఆర్‌బీఐ జోక్యం వల్ల సమస్య వస్తోందని, ఇంతకు ముందు

రూపాయిని ఒక స్థాయికి కట్టడి చేయడం ఒక తప్పిదమని పేర్కొన్నారు. గతంలో చేసిన తప్పిదాలు ఇప్పటికీ వెంటాడుతున్నాయని తెలిపారు. ఇకపోతే ఇటీవలి కాలంలో అమెరికా తనకు గిట్టని దేశాలపై డాలర్‌తో బాదుతోంది. రష్యా, ఇరాన్, వెనెజువెలా దేశాలపై ఆర్థిక ఆంక్షలు విధించింది. డాలర్లు చిక్కకుండా చేసి, వాటి వ్యాపారాన్ని దెబ్బతీసింది. ఆ దేశాలను ప్రపంచ వాణిజ్యం నుంచి బయటికి పంపడానికి ఇదంతా చేసింది. రేపు తమకూ ఇలాంటి పరిస్థితే తలెత్తితే ఎలాగని ఇతర దేశాల్లో ఆందోళనతో కూడిన అనుమానం మొదలైంది. ఫలితంగా, డాలర్ మీద ఆధారపడటం తగ్గించి కొత్త మార్గాల్లో వాణిజ్యం చేసే ప్రయత్నం ఊపందుకొంటోంది. రష్యా కూడా చైనా, భారత్, కొన్ని ఆఫ్రికన్ దేశాల కరెన్సీలు, రూబుళ్లలో వ్యాపారం చేస్తోంది. భారత్ 30 దేశాలతో రూపాయితో జమలు, చెల్లింపులకు ఖాతాలు తెరచింది. అయితే రష్యాకు భారత్ చేసే ఎగుమతులకన్నా దిగుమతులే ఎక్కువ కావడంతో మన రూపాయలు రష్యన్ బ్యాంకుల్లో పేరుకుపోతున్నాయి. రష్యా భారత్ నుంచి ఎక్కువ దిగుమతులు చేసుకుంటే అవి ఖర్చయ్యేవి. కాకపోతే, ఆ రూపాయలతో భారత్‌లో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉండటంతో, ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. భారత్ ఇతర దేశాలతో రూపాయలు, స్థానిక కరెన్సీల్లో వ్యాపారం మొదలుపెట్టింది. సింగపూర్, యుఏఈ, నేపాల్, భూటాన్‌లలో యూపీఐ చెల్లింపులు ఊపందుకుంటున్నాయి. ఒక్కసారిగా డాలర్లకు దూరం జరిగితే చమురు, ఇతర దిగుమతుల ధరలు పెరిగిపోయి సామాన్యులు ద్రవ్యోల్బణం బారిన పడతారు. అందుకే డాలర్ ఆధిపత్యాన్ని క్రమక్రమంగా వదిలించుకోవాలని ప్రపంచ దేశాలు చూస్తున్నాయి.ఈ క్రమంలో భారత్ కూడా బలమైన వాణిజ్యం దిశగా అడుగులు వేయాల్సి ఉంది. అంతకుముందే రూపాయిని బలోపేతం చేసుకుంటే మంచిది. ప్రపంచంలో ఇప్పటికీ 47శాతం లావాదేవీలకు డాలర్లనే ఉపయోగిస్తున్నారు. అందుకని, మరికొంత కాలం డాలర్ ఆధిపత్యం కొనసాగవచ్చు. ఆ తరవాత కూడా డాలర్ స్థానాన్ని ఏ ఒక్క దేశ కరెన్సీ ఆక్రమించకపోవచ్చు. స్థానిక కరెన్సీలు, డిజిటల్ కరెన్సీలు, బంగారం వాడకం పెరగవచ్చు.



# అమరావతి వర్సెస్ ఫ్యూచర్ సిటీ

ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలు చెరో క్రొత్త నగరాన్ని నిర్మించే పనిలో ఉన్నాయి. ఏపీ ముఖ్యమంత్రి రాష్ట్ర రాజధానిగా అమరావతిని నిర్మించే ప్రయత్నం గత ఆరేళ్లు గా చేస్తూనే ఉన్నారు. మరోవైపు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ పేరుతో హైదరాబాదును అనుకునే మరో నగరాన్ని సృష్టించడం కోసం చాలా కష్టపడుతున్నారు. ఒకప్పుడు ఒకే పార్టీలో ఉన్న ఈ ఇద్దరు ముఖ్యమంత్రులు తమ తమ డ్రీం ప్రాజెక్టులను సాకరం చేసే పనిలో పడ్డారు. రాజకీయంగా తెలంగాణ సీయం రేవంత్ రెడ్డిని ఆయన ప్రత్యర్థులు పదేపదే తెలంగాణ మూవ్ మెంట్ సమయంలో ఆయన పాత్ర పై ప్రశ్నలు సంధిస్తూ ఉంటారు. వాటికి చెక్ పెట్టేందుకు తనదైన బ్రాండ్ ను ప్రమోట్ చేసేందుకు ఫ్యూచర్ సిటీ పేరుతో మరో కొత్త నగరాన్ని సృష్టించే పనిలో రేవంత్ పడ్డారు. హైదరాబాదును ఆడుకుహైదరాబాదును అనుకుని నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ ప్రమోషన్స్ కోసం ఇటీవల ఆయన ఏర్పాటు చేసిన తెలంగాణ రైజింగ్ సమిట్ టాక్ అఫ్ ది స్టేట్ అయింది. ముందుగా ఫ్యూచర్ సిటీ కోసం 30 వేల ఎకరాల్లో దీన్ని నిర్మిస్తుండగా భవిష్యత్ లో దాదాపు లక్షా ఎనభై వేలకు పైగా ఎకరాల్లో విస్తరించే ఆలోచనలో ఉన్నారు.భారత్ ఫ్యూచర్ సిటీ పేరుతో నిర్మిస్తున్న ఈ నగరం ఔటర్ రింగ్ రోడ్, శ్రీశైలం రోడ్డు, నాగర్జున సాగర్ రోడ్ ల మధ్య శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కు ఒక 30 కిమీ దూరం లో రానుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రుల్లో చంద్రబాబు కు సైబర్ సిటీ, వైఎస్ ఆర్ కు ఔటర్ రింగ్ రోడ్ నిర్మాతలుగా పేరు ఉంది. ఇప్పుడు ఫ్యూచర్ సిటీ నిర్మాత గా గా తన పేరు ఉండాలని తెలంగాణ ప్రస్తుత సీయం రేవంత్ రెడ్డి ట్రై చేస్తున్నారు. ఈ సిటీ లో ఫార్మా, %ూా×%, ఎంటర్టైన్మెంట్, స్పోర్ట్స్, ఎడ్యుకేషన్, హెల్త్ రంగాలను ప్రోత్సహించేలా 6 థీమ్ సిటీలను నిర్మించే ప్లాన్ చేశారు రేవంత్. ఇప్పటికే ఆ దిశగా పెట్టుబడులను ఆకర్షించే పనిలో పడింది తెలంగాణ ప్రభుత్వం.కనీసం 10 లక్షల మంది నివసించేలా ఫ్యూచర్ సిటీ నిర్మాణం జరుగుతోంది. తెలంగాణ ప్రభుత్వానికి పెట్టుబడుల ఆకర్షణ పెద్ద కష్టం కాదు. హైదరాబాద్ పేరుతో ఆల్రెడీ ఎస్టాబ్లిష్ అయిన ప్రపంచ స్థాయి సిటీ వారికీ అండగా ఉంది. కేంద్రంపై మరీ ఎక్కువ గా ఆధార పడాల్సిన అవసరం రేవంత్ కు లేదు. ఈ క్రొత్త సిటీ నిర్మాణ పర్యవేక్షణ కు ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ ఆధారిటీ ని కూడా ఏర్పాటు చేశారు. ఈ ఫ్యూచర్ సిటీ ని తెలంగాణ లోని అన్ని ప్రాంతాలతో డైరెక్ట్ గా కనెక్ట్ చేసే రోడ్లు రెడీ చేస్తున్నారు. అలాగే ఫ్యూచర్ సిటీ ని అమరావతి మీదుగా మచిలీపట్నం పోర్ట్ తో లింక్ చేసే గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం కు కూడా ప్రయత్నాలు కొలిక్కి వస్తున్నాయి. 2028 ఎన్నికల టార్గెట్ గా ఫ్యూచర్ సిటీ తొలి దశ పూర్తి చేసే పనుల్లో సీయం రేవంత్ రెడ్డి కష్టపడుతున్నారు.ఏపీ రాజధాని నిర్మాత గా తనపేరు నిలబడి పోవాలని సీఎం చంద్రబాబు నాయుడు చేస్తున్న ప్రయత్నం అమరావతి. మధ్యలో జగన్ ప్రభుత్వం ఉన్న 5ఏళ్ళు తీసేస్తే ఇప్పటికి అమరావతి పనులు మొదలై 6ఏళ్ళు అయింది. ప్రజల నుండి సేకరించిన 33వేల ఎకరాలకు తోడు మరో 23 వేల ఎకరాల వరకూ (ప్రస్తుతానికి) భూమి ల్యాండ్ పూలింగ్ లో తీసుకుని అక్కడ ప్రపంచ స్థాయి రాజధాని ని 9విభాగాలుగా (నవ నగరాలు ) కట్టాలని చంద్రబాబు ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతానికి %జ=ణూ% బిల్డింగ్, అసెంబ్లీ, హై కోర్ట్, సచివాలయం (తాత్కాలికం ) మినహామిగిలిన బిల్డింగ్స్ ఏవీ రెడీ కాలేదు. క్వాంటం వ్యాలీ వస్తుంది అని చెబుతున్నా దాని స్వరూపం పై స్పష్టత రావాల్సి ఉంది. సమస్య ఏమిటంటే ప్రవేట్ పెట్టుబడులు అమరావతిలో ఇంకా పూర్తిగా కార్యరూరం దాల్చలేదు.కేంద్రం నుండి కూడా పూర్తి స్థాయిలో అమరావతి కి సాయం అందుతుందా అంటే లేదనే చెప్పాలి. ఇచ్చేదంతా అప్పుగానే ఇస్తున్నారు. పైగా ఏపీ కి రెవెన్యూ పరం గా అండగా నిలబడే హైదరాబాద్ లాంటి నగరం లేదు. అయినప్పటికీ చంద్రబాబు మొండిగా అమరావతి కోసం పోరాడుతున్నారు. ఏదేమైనా 2029 ఎన్నికలకు ముందుగానే అమరావతి కి ఒక రూపం తేవాల్సిన అవసరం పొలిటికల్ గా చంద్రబాబు పై ఉంది. ప్రస్తుతానికి అయితే ఒక మేర రేవంత్ ఫ్యూచర్ సిటీ పనులు కాస్త స్పీడ్ గా జరుగుతున్నట్టు కనిపిస్తున్నా చంద్రబాబు కూడా ప్రతికూల పరిస్థితుల్లోనూ తాను అనుకున్నది సాధించి తీరతారని ఆయన అభిమానులు కూటమి నేతలు అంటున్నారు

# హడ్కో నుంచి 5 వేల కోట్ల రుణం

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పనులను వేగవంతం చేస్తోంది. ఇందుకోసం హడ్కో నుంచి ప్రభుత్వం రూ. 5 వేల కోట్ల రుణాన్ని సమీకరించింది. ఈ నిధులతో నిలిచిపోయిన పాత బిల్లులను త్వరలోనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు. వచ్చే మార్చి 31 నాటికి రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇళ్లను పూర్తి చేసి గృహప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలకు గ్రీన్ చానెల్ ద్వారా ప్రతి సోమవారం లబ్ధిదారుల అకౌంట్లలోకి డబ్బులు నేరుగా వెళ్లనున్నాయి.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఆర్థిక వనరుల కొరత లేకుండా రాష్ట్ర ప్రభుత్వం హడ్కో నుండి రూ. 5 వేల కోట్ల భారీ రుణాన్ని తీసుకుంది. ఈ నిధుల రాకతో ఇళ్ల నిర్మాణ ప్రక్రియ మరింత వేగవంతం కానుంది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారుల బిల్లులను త్వరలోనే వారి వారి ఖాతాల్లో జమ చేసేందుకు హౌసింగ్ అధికారులు కసరత్తు పూర్తి చేశారు. బేస్మెంట్, స్లాబ్ మరియు ఫినిషింగ్ వంటి వివిధ దశల్లో ఉన్న ఇళ్లకు సంబంధించి ప్రభుత్వం ప్రతీ సోమవారం గ్రీన్ చానెల్ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు పంపిణీ చేయనుంది. నిధుల లభ్యత పెరగడంతో.. క్షేత్రస్థాయిలో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి నిధులు విడుదల చేయాలని కలెక్టర్లు , ప్రాజెక్టు డైరెక్టర్లకు ఆదేశాలు అందాయి.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు.. అంటే మార్చి 31 నాటికి లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 1.48 లక్షల ఇళ్ల పనులు కొనసాగుతుండగా.. ఇప్పటికే 60 వేల ఇండ్లు స్లాబ్ దశకు చేరుకున్నాయి. హౌసింగ్ సెక్రటరీ, కార్పొరేషన్ అధికారులు నిత్యం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్లతో సమావేశాలు నిర్వహిస్తూ పనులను పర్యవేక్షిస్తున్నారు.ప్రభుత్వం ఈ పథకానికి బడ్జెట్‌లో రూ. 12 వేల కోట్లు కేటాయించింది.

# ఏపీ సమస్యలపై తెలంగాణలో ఆందోళన...

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొందరు చేస్తున్న పనులు పార్టీకి చెడ్డ పేరు తీసుకొస్తున్నాయి. చాలామంది నేతలు ఏపీలో రాజకీయాలు చేస్తున్నారు. పార్టీ కార్యక్రమాల నిర్వహణ మాత్రం పక్క రాష్ట్రాల్లో చేస్తున్నారు. అధినేత జగన్మోహన్ రెడ్డి వారంలో మూడు రోజులు పాటు తాడేపల్లి కి వచ్చి పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నారు. మిగతా నాలుగు రోజులు బెంగళూరుకు పరిమితం అవుతున్నారు. అయితే ఆయనను చూసి ఇప్పుడు కొత్తగా యాంకర్ శ్యామల లాంటి వారు సైతం ఏపీని తొంగి చూడడం లేదు. హైదరాబాదులో ఉంటూ ప్రత్యేక వీడియోలు విడుదల చేస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై అధికార ప్రతినిధి హోదాలో ఇలా వీడియోలు తీసి మీడియాకు అందిస్తున్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. అంతవరకు ఓకే కానీ.. ఏకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను సైతం హైదరాబాదులోనే.. అది కూడా తాను నివాసం ఉంటున్న కూకట్పల్లి ప్రాంతంలోనే నిర్వహిస్తుండడం మాత్రం కాస్త అతిగా మారుతుంది.సోషల్ మీడియావచ్చాక రాజకీయ పార్టీల తీరు మారింది. ఆ పార్టీ కార్యక్రమాల తీరు కూడా మార్చేశారు. ఎక్కడో విదేశాల్లో ఉంటే సెల్ఫీ వీడియో తీసి సోషల్ మీడియాకు జత చేస్తున్నారు. మెయిన్ మీడియా కూడా అదే వీడియోను ప్రసారం చేసి వారికి ఎనలేని ప్రచారం కల్పిస్తోంది. అయితే పెద్ద నేతలు వరకు ఓకే కానీ అధికార ప్రతినిధి హోదాలో.. పనిచేస్తున్న యాంకర్ శ్యామల లాంటి వారు కూడా ఇలా చేయడం ఏంటి అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక ప్రశ్న వినిపిస్తోంది. పైగా ఆమెకు ఆర్థిక ప్రయోజనం ఉందన్న టాక్ ఉంది. జీతాల రూపంలో సేవలు అందిస్తున్నారు అన్న మాట వినిపిస్తోంది.ఇటీవల పిన్నెల్లి బ్రదర్స్ అరెస్టయ్యారు. అయితే ఆమెకు ఆ విషయం తెలియదు అన్నట్టు ఉంది. వారు రెండు రోజుల క్రితం అరెస్టు అయితే.. ఆమె నిన్ననే కారుమూరి వెంకటరెడ్డి అనే నేత కలిసి కూకట్పల్లిలో ఆందోళన చేశారు. అంతకు ముందు కూడా ఆమె ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ ఒక ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు హైదరాబాదులో. అక్కడే సంతకాల సేకరణ చేపట్టారు. అయితే ఆమె ఏపీ రాజకీయాల గురించి మాట్లాడుతూ హైదరాబాదులో ఉంటున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం తన బుల్లితెర కెరీర్ ను వదులుకున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నుంచి కొంత మొత్తం జీతం అందుకుంటున్నారన్న టాక్ ఉంది. అందుకే కాబోలు హైదరాబాదు నుంచి తన రాజకీయాలను సాగిస్తున్నారు. అయితే తమకు అలాంటి అవకాశం కల్పించాలని ఇప్పుడు వైసీపీ నేతలు పార్టీ హై కమాండ్ ను కోరుతున్నారు. ఎక్కడో వ్యాపారాలు చేసుకుంటూ రాజకీయం చేస్తాము అంటూ సెటైర్లు వేస్తున్న వారు ఉన్నారు.



# సంక్రాంతి తర్వాత సందడే సందడి

విక్టరీ వెంకటేష్ కెరీర్‌లో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా ఓ మైలురాయిగా నిలిచింది. అనీల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం ఏకంగా రూ.300 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టి ఇండస్ట్రీని ఆశ్చర్యపరిచింది. అప్పటివరకు 100 కోట్ల క్లబ్‌ను కూడా టచ్ చేయని వెంకీ, ఒక్కసారిగా ఇంత భారీ విజయం సాధించడంతో ఆయన స్టార్‌డమ్ ఒక్కసారిగా రెట్టింపు అయింది. గత సంక్రాంతి మొత్తం వెంకటేష్ గురించిన చర్చే సాగింది.ఇప్పుడు ఈ సంక్రాంతికి కూడా వెంకీ అభిమానులకు మరో ప్రత్యేక ట్రీట్ సిద్ధమవుతోంది. మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రంలో వెంకటేష్ కీలక పాత్రలో కనిపించనున్నారు. తొలుత గెస్ట్ రోల్‌గా అనుకున్న ఈ పాత్రను చిరంజీవి సూచనతో దర్శకుడు అనీల్ రావిపూడి పూర్తి స్థాయి కీలక పాత్రగా మలిచారు. దాదాపు 20 నిమిషాల నిడివితో డిజైన్ చేసిన ఈ పాత్ర సినిమాలో ప్రధాన ఆకర్షణగా నిలవనుందని సమాచారం. చిరంజీవి-వెంకటేష్ కాంబినేషన్‌లో ఒక ప్రత్యేకమైన సాంగ్ కూడా ఉండనుంది. కడుపుబ్బా నవ్వించే కామెడీ ట్రాక్‌తో పాటు మాస్ మసాలా సాంగ్‌లో ఇద్దరూ కలిసి స్టెప్పులు వేయనుండటంతో అభిమానుల్లో అంచనాలు పెరిగాయి. ఈ విధంగా వరుసగా రెండు సంక్రాంతుల్లో వెంకటేష్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉండగా, వెంకటేష్ కొత్త సినిమా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఇప్పటికే ప్రారంభమైంది. 'ఆదర్శకుటుంబం హౌస్ నెంబర్ 47' అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. తొలిసారి వెంకటేష్‌తో త్రివిక్రమ్ పని చేయడం, అలాగే 'మల్లీశ్వరి' వంటి చిత్రానికి రచయితగా ఉన్న త్రివిక్రమ్ హస్తం ఇందులో ఉండటం ఈ ప్రాజెక్ట్‌కు మరింత క్రేజ్ తీసుకొచ్చాయి. ఈ సినిమా 2026 ద్వితీయార్థంలో ప్రేక్షకుల ముందుకు రానుంది. మరోవైపు, సూపర్ హిట్ సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ 'దృశ్యం' ఫ్రాంచైజీ నుంచి పార్ట్ 3కు కూడా రంగం సిద్ధమవుతోంది. మలయాళంలో దర్శకుడు జీతూ జోసెఫ్ ఇప్పటికే 'దృశ్యం 3' షూటింగ్ పూర్తి చేయగా, బాలీవుడ్ వెర్షన్ కూడా త్వరలోనే ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో టాలీవుడ్ 'దృశ్యం 3'పై ఆసక్తి పెరుగుతోంది. మలయాళ వెర్షన్ నుంచి జీతూ జోసెఫ్ రిలీవ్ అయిన తర్వాత తెలుగు వెర్షన్‌పై కొత్త అప్‌డేట్ కొత్త ఏడాదిలో వచ్చే అవకాశం ఉందని సమాచారం.ఇప్పటికే 'దృశ్యం' సిరీస్‌లో వచ్చిన రెండు భాగాలు భారీ విజయం సాధించాయి. ముఖ్యంగా సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ జానర్‌కు తెలుగు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. రెండో భాగం కోవిడ్ కారణంగా థియేటర్లకు రాకపోయినా, ఓటీటీలో మంచి టాక్ సొంతం చేసుకుంది. ఈ క్రమంలో వెంకటేష్ నుంచి రాబోయే సినిమాలు ఆయన కెరీర్‌ను మరింత ఎత్తుకు తీసుకెళ్లనున్నాయనే అంచనాలు బలంగా ఉన్నాయి.



## ఆదిసాయికుమార్ నా పేరు శంబాల సాంగ్ చూశారా..?




టాలీవుడ్ యంగ్ యాక్టర్ ఆదిసాయికుమార్ నటిస్తోన్న తాజా చిత్రం శంబాల డిఫరెంట్ కాన్సెప్ట్‌తో వస్తోన్న శంబాల చిత్రానికి ఏ యాడ్ ఇన్ఫినిటీ ఫేం యుగంధర్ ముని దర్శకత్వం వహిస్తున్నాడు. శంబాల మిస్టికల్ వరల్డ్ ఎలా ఉండబోతుందో హింట్ ఇస్తూ కట్ చేసిన మేకింగ్ విజువల్స్ ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతున్నాయి. మొత్తానికి ఈ సారి హిట్ కొట్టడం పక్కా అని విజువల్స్ చెప్పకనే చెబుతున్నాయి. ఈ మూవీ నుంచి నా పేరు శంబాల సాంగ్ విడుదల చేశారు మేకర్స్. సినిమా థీమ్ ఎలా ఉండబోతుందో హింట్ ఇస్తూ.. శంబాల ప్రపంచాన్ని చూపిస్తున్న ఇంట్రో సాంగ్ సినిమాకు హైలెట్‌గా నిలిచిపోనుందని విజువల్స్ చెబుతున్నాయి. కిట్టు విస్సా ప్రగడ రాసిన ఈ పాటను శ్రీచరణ్ పాకాలకంపోజిషన్‌లో గీతా మాధురి పాడింది. మేకర్స్ ఇప్పటికే లాంచ్ చేసిన పోస్టర్‌లో ఆది సాయికుమార్ మంటల మధ్యలో నుంచి సైకిల్‌పై వస్తూ సినిమా కథపై క్యూరియాసిటీ పెంచుతున్నాడు. మరోవైపు పొలంలో వింత ఆకారంలో ఉన్న దిష్టిబొమ్మ.. మరోవైపు ఆకాశం నుంచి భూమివైపు వస్తున్న నిప్పు కణం చూడొచ్చు. అనుమానాస్పద ప్రపంచం.. అంటూ శంబాల మూవీపై హైప్ పెంచేస్తున్నారు మేకర్స్.




## వైల్డ్ బ్లాక్‌బస్టర్ 'మోగ్లీ'.. తొలి రోజే కోటి వసూళ్లు!

యాంకర్ సుమ తనయుడు రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్ జంటగా నటించిన తాజా చిత్రం 'మోగ్లీ' బాక్సాఫీస్ వద్ద బోణీ అదిరింది. యువ దర్శకుడు సందీప్ రాజ్ తెరకెక్కించిన ఈ చిత్రం డిసెంబర్ 13, 2025న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. విడుదలైన తొలి రోజు నుంచే ఈ సినిమాకు పాజిటివ్ టాక్ లభిస్తోంది. 'మోగ్లీ' తొలి రోజే కలెక్షన్ల పరంగా అదరగొట్టింది. ప్రపంచవ్యాప్తంగా మొదటి రోజే ఈ చిత్రం రూ. 1.22 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు చిత్ర నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధికారికంగా వెల్లడించింది. ప్రీమియర్ షోలతో కలిపి ఈ మొత్తం కలెక్షన్స్ నమోదు అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా, "వైల్డ్ బ్లాక్‌బస్టర్" అంటూ చిత్ర యూనిట్ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఓ పోస్టర్‌ను కూడా విడుదల చేసింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌లో టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రంలో రోషన్, సాక్షిలతో పాటు బండి సరోజ్ కుమార్, హర్ష చెముడు తదితరులు కీలక పాత్రలు పోషించారు.

## ఎన్నాకెన్నాళ్లకు.. ఫైనల్‌గా అయలాన్ తెలుగు రిలీజ్‌పై క్లారిటీ



కోలీవుడ్ స్టార్ హీరో శివకార్తికేయన్ రకుల్ ప్రీత్ సింగ్ కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం అయలాన్ ఆర్ రవికుమార్ డైరెక్షన్‌లో తెరకెక్కిన ఈ మూవీ తమిళనాడులో పొంగల్ కానుకగా జనవరి 12న విడుదలై మంచి టాక్ తెచ్చుకుంది. అయలాన్ తెలుగు వెర్షన్ ను కూడా అదే తేదీన (జనవరి 26న) తెలుగు రాష్ట్రాల్లో గ్రాండ్‌గా విడుదల చేయాల్సి ఉండగా.. పలు కారణాల వల్ల థియేటర్ల నుంచి తొలగించారు. కాగా తమిళ్ వెర్షన్ ఫిబ్రవరి 9 సన్ నెక్ట్స్‌లోకి వచ్చేసింది. అయితే తెలుగు వెర్షన్ ఎప్పుడు వస్తుందనే దానిపై ఇప్పటివరకు ఎలాంటి అప్‌డేట్ రాలేదు. అయితే తెలుగులో కూడా మేకర్స్ విడుదలకు ప్లాన్ చేసినప్పటికీ వర్కవుట్ కాలేదు. కానీ మేకర్స్ అప్పటినుంచి థియేటర్ రిలీజ్ అప్‌డేట్ లేదా ఓటీటీ రిలీజ్‌పై కూడా ఎలాంటి వార్త షేర్ చేయలేదు.తీవ్ర నిరాశలో ఉన్న తెలుగు మూవీ లవర్స్ కు ఫైనల్‌గా మేకర్స్ అదిరిపోయే వార్త అందించారు. అయలాన్ డైరెక్టుగా టీవీలో సందడి చేయనుంది. డిసెంబర్ 21న మధ్యాహ్నం 3 గంటలకు ప్రీమియర్ కానుంది. అయితే తెలుగు ఓటీటీ వెర్షన్ రిలీజ్‌కు సంబంధించి మాత్రం ఎలాంటి అప్‌డేట్ ఇవ్వలేదు మేకర్స్.అయలాన్ 2 కూడా తెరకెక్కించనున్నట్టు కేజేఆర్ స్టూడియోస్, ఫాంటోమ్‌ఎఫ్ ఎక్స్ స్టూడియో ఇప్పటికే సంయుక్తంగా ప్రకటన కూడా చేశాయి. సీక్వెల్ కోసం ప్రత్యేకించి రూ.50 కోట్లు కేవలం వీఎఫ్‌ఎక్స్, సీజీఐ పనుల కోసమే ఖర్చుపెట్టబోతున్నట్టు కూడా ప్రకటించారు మేకర్స్. ఈ మూవీకి మ్యూజిక్ సెన్సేషన్, ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించాడు.

## పెళ్లి తర్వాత భర్తతో తొలిసారి దర్శనం ఇచ్చిన సమంత.. ముంబైలో ఏం చేస్తున్నారు

నటి సమంత,దర్శకుడు రాజ్ నిడిమోరు డిసెంబర్ 1న కుటుంబ సభ్యులు, సన్నిహిత మిత్రుల సమక్షంలో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ శుభవార్తను సమంత సోషల్ మీడియాలో ఒక స్వీట్ నోట్‌తో స్వయంగా ధృవీకరించారు. ఎలాంటి ఆర్భాటాలు లేకుండా జరిగిన ఈ పెళ్లి ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. కోయంబత్తూర్‌లోని ఇషా ఫౌండేషన్‌లో లింగ భైరవ సంప్రదాయంలో ఈ వివాహం జరగడం విశేషంగా నిలిచింది.పెళ్లి తర్వాత సమంత -రాజ్ జంట తొలిసారిగా కలిసి బహిరంగంగా కనిపించారు. శనివారం మధ్యాహ్నం ముంబై విమానాశ్రయం నుంచి బయలుదేరుతున్న సమయంలో ఈ నూతన వధూవరులు కెమెరాలకు చిక్కారు. ఇద్దరూ సాధారణ దుస్తుల్లో సింపుల్‌గా కనిపించగా, ఫోటోగ్రాఫర్లు పెళ్లి శుభాకాంక్షలు తెలియజేయగా వారు చిరునవ్వుతో కృతజ్ఞతలు తెలిపారు. సమంత అక్కినేని గతంలో నాగ చైతన్యను వివాహం చేసుకుని విడిపోయిన విషయం తెలిసిందే. ఆ తర్వాత నాగ చైతన్య నటి శోభిత ధూళిపాలను పెళ్లాడారు. మరోవైపు రాజ్ నిడిమోరు 2015లో శ్యామలి దేతో వివాహం చేసుకోగా, 2022లో వీరు విడిపోయినట్లు ప్రచారం జరిగింది. సమంత%-%రాజ్ మధ్య సంబంధం గురించి గత ఏడాది ప్రారంభం నుంచే పుకార్లు వినిపించాయి. అప్పటి నుంచి ఈ జంట బహిరంగ కార్యక్రమాల్లో కలిసి కనిపించడం, కలిసి నివసిస్తున్నారన్న వార్తలు రావడం చర్చకు దారితీశాయి. అయినప్పటికీ ఇద్దరూ తమ బంధంపై ఎప్పుడూ అధికారిక ప్రకటన చేయలేదు. సమంత తన సోషల్ మీడియా పోస్టుల్లో అప్పుడప్పుడు రాజ్ పేరును ప్రస్తావిస్తూ అభిమానులను టీజ్ చేసినా, వారి సంబంధాన్ని స్పష్టంగా ధృవీకరించలేదు. ఇక వీరి పరిచయం 'ది ఫ్యామిలీ మ్యాన్ సీజన్ 2' సెట్స్‌లో మొదలైందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఆ సిరీస్ పూర్తైన తర్వాత కూడా కలిసి పలు ప్రాజెక్ట్స్‌లో పని చేయడం వల్ల స్నేహం కాస్తా ప్రేమగా మారిందని సమాచారం.



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.